for e-paper scan now



# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక
teenmaardesk@gmail.com

## తీన్మార్ ప్రేరణ ప్రశ్న..

ప్రజా సంక్షేమంటే అప్పు చేసి పప్పుకూడు పెట్టడమేనా..?



అప్పులతో సంక్షేమాలు..
అడ్డగోలు పన్నులతో ప్రజలపై భారం..?
అప్పులు చేసి మరీ సంక్షేమ పథకాల అమలెందుకో..?
ఆ పై అప్పులు తీర్చడానికి (ప్రజలపై) అడ్డగోలు పన్నులా?

రెడ్డి. శేఖర్
ఎడిటర్,
తీన్మార్ దినపత్రిక



ములుగు | సంపుటి : 02 | సంచిక : 312 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 27 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



2 లో..

### సేంద్రియ ఉత్పత్తులను ఆదరించాలి

ములుగులో ఏర్పాటు చేసిన పెంపకం, ఉత్పత్తి శిక్షణ కేంద్రం
పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ



### రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా కల్మెకోలను శ్రీనివాస్‌రెడ్డి

2 లో..

నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



2 లో..

### రామరాజ్యం పేరుతో మతపరమైన దాడులను ఖండిస్తున్న

డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్



### రూ. 500 గ్యాస్ పథకం అమలుకు రంగం సిద్ధం

మొదట మొత్తం ధర చెల్లించాల్సిందే..
అనంతరం అకౌంట్లో జమ
ఉజ్వల గ్యాస్ కనెక్షన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు సమాచారం

# ఎంపీ అభ్యర్థుల ఖరారులో
# పార్టీల కసరత్తు

ఆశావహుల్లో టెన్షన్

హస్తినలో కమలదళం
హైదరాబాద్‌లో కేసీ వేణుగోపాల్ మంతనాలు
బీఆరెస్‌లో కరువైన హడావుడి

వివరాలు 2 లో..



## మహిళా అధికారుల నేతృత్వంలో
# మేడారం జాతర

90 శాతం నిర్వహణధికారులు మహిళలే కావడం యాదృశ్చికం.. తీన్మార్ న్యూస్ ప్రత్యేకం



ప్రస్తుత 2024 మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఒక ప్రత్యేకత ఉంది. మాతృస్వామ్య వ్యవస్థకు ప్రాధాన్యతను కల్పించే ఈ మేడారం జాతర నిర్వహణలో దాదాపు 90 శాతం నిర్వహణధికారులు మహిళలే కావడం యాదృశ్చికం.

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 25 (తీన్మార్ న్యూస్): జాతర ఏర్పాట్లను మొత్తం తన భుజాలపై వేసుకొని గత ఆరునెలల నుండి ప్రతిరోజూ స్వయంగా సమీక్షిస్తున్న రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అత్యంత ప్రధాన పాత్ర పోషించారు. దేవాదాయ శాఖ

మిగతా 2 లో



## ఏళ్లుగా తిష్టవేసిన అధికారులను
# బదిలీ చేయాలి

నిర్దేశిత లక్ష్యం మేరకు పన్ను వసూలు సాధించాలి
ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం రూపొందించాలి
రాష్ట్ర మంత్రులు, అధికారులతో సీఎం సమీక్షా సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): పన్ను వసూళ్లలో నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అన్ని శాఖలు సాధించాలని ముఖ్యమంత్రి సోమవారం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖ పన్ను వసూళ్లపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖలో పన్ను లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది వరకు జీఎస్టీ పరిహారం కింద రూ.4 వేల కోట్లకుపైగా చెల్లించేదని, దాని గడువు

మిగతా 2 లో

## రైతుల అణచివేతకు పాల్పడుతున్నది మోదీ ప్రభుత్వం

సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె. నారాయణ
అణిచివేతను నిరసిస్తూ భారీ ప్రదర్శన నిర్వహించిన సీపీఐ
కనీస మద్దతు ధరపై చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్



2

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

అనుమతులు లేని లేఔట్లకు మరోసారి అవకాశం
లేఔట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం
మార్చి 31లోపు క్రమబద్ధీకరణకు అవకాశం




2

# సేంద్రియ ఉత్పత్తులను ఆదరించాలని ప్రజలకు పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): అటవీ కళాశాల, పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయంగా పెంచుతున్న తేనెటీగల కేంద్రం నుంచి తయారు చేసిన ఆర్గానిక్ (సేంద్రియ) తేనెను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. సేంద్రియ ఉత్పత్తులను ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులకు తేనెటీగల పెంపకం, ఆదాయ అభివృద్ధిపై శిక్షణను ఇచ్చేందుకు హైదరాబాద్ శివారు ములుగులో ఉన్న ఫారెస్ట్ కాలేజీలో ప్రత్యేక తేనెటీగల పెంపకం, ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పారు. రైతులతో పాటు ఔత్సాహిక వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, మహిళలకు తేనెటీగల పెంపకంపై వారం రోజుల శిక్షణా కార్యక్రమాలను ఫారెస్ట్ కాలేజీ అందిస్తున్నది. సెంటర్ ఆధ్వర్యంలో పూర్తి సేంద్రీయ పద్ధతుల్లో అభివృద్ధి చేసిన తేనెను 'వైల్డ్ ఫ్లేవర్స్' బ్రాండ్ పేరుతో ఫారెస్ట్ కాలేజీ అందుబాటులోకి తెస్తున్నది. ములుగు ఫారెస్ట్ కాలేజ్‌లో త్వరలో ఒక తేనె విక్రయ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు డీన్ ప్రియాంక వర్గీస్ తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్, ఫారెస్ట్ కాలేజీ డీన్ ప్రియాంక వర్గీస్ పాల్గొన్నారు.

# రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా కల్మెకోలను శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా పల్లెపహాడ్ వాసి నియామకం కావడం జరిగింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 25న నియామక ఉత్తర్వులు జారీ చేసింది. మీడియా అకాడమీ చైర్మన్‌గా వారు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ప్రజాప్రక్షం దినపత్రికకు సంపాదకులుగా వ్యవహరిస్తున్న కల్మెకోలను శ్రీనివాస్‌రెడ్డి గతంలో ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా, ఐజేయూ సెక్రటరీ జనరల్‌గా కూడా పని చేశారు. ఇంక వారి కుటుంబ వివరాలు పరిశీలిస్తే.. కల్మెకోలను అండమ్మ రాంరెడ్డి దంపతులకు ఆరుగురు సంతానంలో శ్రీనివాస్‌రెడ్డి పెద్దకుమారుడు. విద్యాభ్యాసం పూర్తిగా నాగారం, సూర్యాపేట, హైదరాబాద్‌లోనే జరిగింది. శ్రీనివాస్‌రెడ్డికి భార్య భారతమ్మ, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడున్నారు.

# రూ. 500 గ్యాస్ పథకం అమలుకు రంగం సిద్ధం

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో తనదైన ముద్రతో ముందుకు దూసుకెళ్తుంది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. దీనికి ప్రజల నుంచి మంచి రెస్పాన్స్ కూడా వస్తున్న విషయం తెలిసిందే. ఇక తాజాగా, మరో రెండు గ్యారెంటీలను అమలు అధికారులు చర్యలు చేపట్టారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఈ నెల 27వ తేదీన రూ. 500కే గ్యాస్ సిలిండర్‌ను అందేలా పథకం ప్రారంభించనున్నారు. ఈ పథకంలో ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్న వారికి కూడా అవకాశం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో తెలంగాణ సివిల్ సప్లై అధికారులు అనేక సూచనలను చేసింది. లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్ డెలివరి అయ్యిన సమయంలో పూర్తి అమౌంట్ ను చెల్లించాలి. ఆ తర్వాత 500 పోను మిగతా అమౌంట్ లబ్ధిదారుల అకౌంట్ లో జమఅవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే హైదరాబాద్‌లో గ్యాస్ సిలిండర్ రూ.955 గా ఉంది. తెలంగాణలో కొన్నిచోట్ల సిలిండర్ ధరల్లో స్వల్పమైన మార్పులుండవచ్చు. ట్రాన్స్ పోర్టు ధరల్లో హెచ్చు, తగ్గుల వల్ల ఈ ధరలలో వ్యత్యాసం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉజ్వల పథకం కింద11.58 లక్షల మంది ఉండగా వారందరినీ కూడా మహాలక్ష్మీ పథకంలోకి చేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్రం నుంచి ప్రతి సిలిండర్ కు రూ. రూ.340 రాయితీ లభిస్తోంది. ఈ రాయితీ పోనూ మిగతా మొత్తం, అదనంగా రవాణా ఛార్జీలు కూడా పడకుండా ఆ డబ్బునంతా ప్రభుత్వం భరిస్తుందన్న మాట. ఇదిలా ఉండగా ఆదివారం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈక్రమంలో వెంటనే పథకం అమలుకు గాను రూ.80 కోట్ల విడుదలకు అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే.

# ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు

**పరీక్షల కోసం 1,521 సెంటర్ల ఏర్పాట్లు**

**పరీక్షల సజావుకు 75 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్స్**

**ప్రకటన విడుదలచేసిన బోర్డు కార్యదర్శి శృతి ఓఝా**

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు బోర్డు కార్యదర్శి శృతి ఓఝా తెలిపారు. పరీక్షల కోసం 1,521 సెంటర్లను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్షలకు మొత్తం 9లక్షల 80 వేల 978 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం నుంచి 4,78,718 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 4,44,189 మంది, సెకండియర్ ప్రైవేట్‌లో 58,071 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల కోసం 1,521 చీఫ్ సూపరింటెండెంట్, 27,900 ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. 75 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల సందర్భంగా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని సంస్థను కోరినట్లు తెలిపారు. పరీక్షలా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, ఎలాంటి అదనపు పేపర్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంచినీటి సదుపాయంతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పరీక్షకు ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థులంతా తప్పనిసరిగా పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఇప్పటికే %ంఎఅవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ% వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలుంటాయన్నారు.

# ఎంపీ అభ్యర్థుల ఖరారులో పార్టీల కీలక కసరత్తు

మొదటి పేజీ తరువాయి

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో కీలక కసరత్తులో నిమగ్నమయ్యాయి. ఢిల్లీలో శనివారం బీజేపీ పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశమవ్వగా, కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, బోర్డు సభ్యుడు ఎంపీ లక్ష్మణ్, బండి సంజయ్, డీకే.అరుణ, ఈటల రాజేందర్‌లు హాజరయ్యారు. వారు అభ్యర్థుల ఖరారుకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్‌షాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నేడో రేపో పార్టీ ఎంపీ అభ్యర్థుల తొలి జాబితా వెలువడవచ్చని సమాచారం. తెలంగాణలోని 17లోక్‌సభ స్థానాల్లో 10స్థానాలు గెలువాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. బీజేపీ ప్రధానంగా సిటింగ్ స్థానాలు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, సికింద్రాబాద్‌లతో పాటు వరంగల్, మహబూబ్‌నగర్, జహీరాబాద్, భువనగిరి, చేవెళ్ల, మెదక్, మల్కాజిగిరి ఎంపీ స్థానాలలో గెలుపు అవకాశాలున్నాయని కమలనాథులు భావిస్తున్నారు. ఆ స్థానాల్లో గెలుపు గుర్రాల ఎంపికపై దృష్టి పెట్టిన బీజేపీ అధిష్టానం నేడో రేపో అభ్యర్థులపై కీలక ప్రకటన చేయవచ్చని పార్టీ వర్గాల కథనం. సిటింగ్‌లు బండి సంజయ్, అర్వింద్‌కుమార్, కిషన్‌రెడ్డిలకు మరోసారి టికెట్లు ఖాయంకాగా, అదిలాబాద్‌లో సోయం బాపురావు ను మార్చే అవకాశముందంటున్నారు. మహబూనగర్‌లో డీకే అరుణ లేక జితేందర్‌రెడ్డి, చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భువనగిరిలో బూర నర్సయ్యగౌడ్‌లు పేర్లతో తొలి జాబితా వెలువడవచ్చని తెలుస్తుంది. మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్, మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు పోటీ పడుతున్నారు. భువనగిరిలో బూర నర్సయ్యగౌడ్‌కు పోటీగా కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ సలహాదారు వెదిరే శ్రీరామ్, పార్టీ ఉపాధ్యక్షుడు జి.మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు టికెట్ ఆశిస్తున్నారు. సామాజిక సమీకరణ బలాబలాల మేరకు నర్సయ్యగౌడ్‌కు టికెట్ దక్కవచ్చని భావిస్తున్నారు. మెదక్ సీటు కోసం మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, జహీరాబాద్, వరంగల్, పెద్దపల్లి, మహబూబ్‌బాద్, నల్లగొండలలో కూడా బలమైన అభ్యర్థులను బరిలోకి దించాలని బీజేపీ నాయకత్వం కసరత్తు చేస్తుంది. హైదరాబాద్‌లో రాజాసింగ్ లేదా మరో బలమైన నేతను పోటీకి దించి ఎంఐఎంకు గట్టి పోటీ ఇవ్వాలని తలపోస్తుంది.వలస నేతలపై కన్నేసిన బీజేపీ చేరికల పిదప కొన్ని స్థానాల్లో వారిని పార్టీ తరుపునా పోటీ చేయించాలని చూస్తుంది. బీఆరెస్, కాంగ్రెస్‌లలో టికెట్ దక్కని నేతలను బీజేపీ తరుపునా టికెట్లు ఇచ్చే అవకాశం లేకపోలేదు.

# మహిళా అధికారుల నేతృత్వంలో విజయవంతంగా మేడారం జాతర





మొదటి పేజీ తరువాయి

మంత్రిగా ఉన్న కొండా సురేఖ కూడా, తాను, అస్వస్తులైనప్పటికీ తన శాఖ అధికారులతో సమీక్షిస్తూ పలుమార్లు మేడారాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఇక, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి గత అనుభవం లేనప్పటికీ ప్రతీ సూక్ష్మ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం వల్ల ఈ మహా జాతర ఏవిధమైన ఇబ్బందులు లేకుండా కొనసాగిందని చెప్పవచ్చు.

**2008 జాతర కూడా మహిళా అధికారుల నేతృత్వం**

అయితే, ప్రస్తుత జాతరతోపాటు, 2008 సంవత్సరంలో జరిగిన మేడారం జాతర కు ఇంతే, ప్రత్యేకత ఉంది. ఆ జాతరను విజయవంతంగా నిర్వహించిన అధికారులలో ముఖ్యమైన వారందరూ మహిళలు ఉండడం ప్రత్యేకత. ప్రధానంగా మాతృస్వామ్య వ్యవస్థకు అత్యంత పాదాన్యత మన దేశంలో గిరిజన తెగల్లో ఉంది. మాతృస్వామ్య వ్యవస్థలో భాగంగానే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పరిగణించాలి. 2008లో జాతర నిర్వహణా బాధ్యతలో పాలుపంచుకున్నవారిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అందరూ మహిళా అధికారులే ఉండడం గమనార్హం. జిల్లా కలెక్టర్ దమయంతి, పోలీస్ సూపరింటెండెంట్ సౌమ్య మిశ్రా, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ధన్వంతి, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, మహిళా శిశు సంక్షేమ శాకాధికారి, జిల్లా పంచాయితీ అధికారి పద్మజారాణి ఇలా అనేక శాఖలకు మహిళా అధికారులే ఉన్నారు. వీరందరి నేతృత్వంలో జాతర విజయవంతంగా ఏవిధమైన సంఘటనలు లేకుండా నిర్వహించారు. అప్పుడు, తాడ్వాయి మండల పరిషద్ అధ్యక్షులుగా కూడా సమ్మక్క అనేమహిళనే ఉంది. వీరితోపాటు మరెందరో మహిళా అధికారులు ఆ 2008 జాతరలో విశేష సేవలందించారు. అందుకే, ఆ జాతరను ప్రత్యేక జాతరగా పేర్కొనవచ్చు.

**మహిళా అధికారుల నేతృత్వంలో 2024 మేడారం మహా జాతర నిర్వహణ**

2024 మేడారం జాతర మొత్తం మహిళల నేతృత్వంలోనే పకడ్బందీగా జరగడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఈ జాతరలో మహిళా ప్రజా ప్రతినిధులు, అధికారుల వివరాలు..



- దనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర గిరిజన, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి.
- కొండా సురేఖ, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి.
- మాలోతు కవిత, మహబూబ్ బాద్ పార్లమెంటు సభ్యురాలు.
- బడే నాగ జ్యోతి, జిల్లా పరిషత్ ఛైర్మన్, ములుగు
- ఇలా త్రిపాఠి, ములుగు జిల్లా కలెక్టర్.
- చిత్రా మొహ్రా, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్.
- శ్రీజ, ములుగు అసిస్టెంట్ కలెక్టర్.
- రాధికా గుప్తా, హన్మకొండ అడిషనల్ కలెక్టర్.
- ప్రతిమా సింగ్, అడిషనల్ కలెక్టర్.
- శ్రద్ధా శుక్లా, ట్రైనీ కలెక్టర్.
- లేనీనా, జిల్లా సంక్షేమ అధికారి.
- బండి పల్లవి, పీఆర్ఓ.
- ఈవీ కిరణ్మయి, పీఆర్ఓ.
- హేమలత, గిరిజన సంక్షేమ శాఖ కార్య నిర్వాహక ఇంజనీరు.
- ఉష, సమాచార ఇంజనీరు.

# ఏళ్లుగా తిష్టవేసిన అధికారులను బదిలీ చేయాలి

మొదటి పేజీ తరువాయి

ముగియడంతో ఆ నిధులు రాకపోవడంతో రాబడిలో వ్యత్యాసం కనిపిస్తోందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మద్యం సరఫరా, విక్రయాలకు సంబంధించిన లెక్కలు తేడాలు ఉంటున్నాయని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రతి డిస్టలరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ అమర్చి వాటిని ట్రాకింగ్ చేయాలని, బాటిల్ ట్రాకింగ్ సిస్టం ఉండాలని, మద్యం సరఫరా వాహనాలు వే బిల్లులు కచ్చితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తో పాటు గతంలో నమోదు చేసిన పలు కేసుల పురోగతిపై నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష సందర్భంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అదే సమయంలో తమ శాఖలోనూ అదే పరిస్థితి నెలకొం దని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి ఆదాయాన్ని తెచ్చే శాఖలకు సొంత భవనాలు లేకపోవడం సరికాదని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో రహదారులపై కంకర కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారని, అలా కాకుండా నగరంలో వివిధ ప్రదేశాల్లో ప్రభుత్వ స్థలాలను అందుకు వినియోగించాలని పేర్కొన్నారు. ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆదేశించారు. వే బిల్లులతో పాటు ఇసుక సరఫరా వాహనాలకు ట్రాకింగ్ ఉండాలని, అక్రమ రవాణాకు అవకాశం ఇవ్వవద్దని ముఖ్యమంత్రి సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకుగానూ పలు గనులపై గతంలో జరిమానాలు విధించారని, కేసులు నమోదు చేశారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. విధించిన జరిమానాలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. గతంలో జరిమానాలు విధించి తర్వాత వాటిని తగ్గించారని, అందుకు కారణాలు ఏమిటో తెలియజేయాలని, దానిపై నివేదిక సమర్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. టీఎస్ ఎండీసీతో పాటు గనుల శాఖలో పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏళ్ల తరబడి తిష్ట వేశారని, కొందరిపై ఆరోపణలున్నాయని, వారిని వెంటనే బదిలీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# రామరాజ్యం పేరుతో మతపరమైన దాడులను ఖండిస్తున్న



గద్వాల, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): రామరాజ్యం పేరుతో మతోన్మాద గుండాలు క్రైస్తవులపై దాడులకు పాల్పడడం రాజ్యాంగ విరుద్ధమని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. జన్వాడలో క్రైస్తవులపై జరిగిన దాడిని ఖండిస్తూ వాయిస్ ఆఫ్ ఆల్ క్రిస్టియన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం గద్వాలలో ఏర్పాటు చేసిన నిరససభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఒకవైపు రామరాజ్యం పేరుతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూనే మ-రోవైపు బిజెపి అనుబంధ సంస్థలైన ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ లాంటి మతోన్మాద గుండాలు క్రైస్తవులపై పాశవికంగా దాడులు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. రాముడు అందరి దేవుడు అయితే దేశంలో మత మైనారిటీలపై ఎందుకు దాడులు జరుగుతున్నాయన్న ఆయన రాజ్యాంగం లేకుంటే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యేవాడా అని ప్రశ్నించారు. జన్వాడలో ఒక వర్గంపై ఆర్ఎస్ఎస్ మూకలు మతం పేరుతో క్రైస్తవులు, దళితులపై వ్యూహాత్మకంగానే దాడులకు పాల్పడ్డారన్నారు. జన్వాడలో క్రైస్తవులపై జరిగిన దాడి చుండూరు, కారంచేడు లాంటిదేనని అన్నారు. ప్రజాస్వామ్య, లౌకిక దేశంలో కుల, మతపరమైన దాడులు క్షమించరాని నేరంగా పరిగణించారు. రాజ్యాంగంలో అధికరణ 25 ద్వారా కల్పించిన మతపరమైన హక్కులకు కాపాడి, మైనారిటీలకు రక్షణ కల్పించాలన్నారు. జన్వాడలో క్రైస్తవులపై పాశవిక దాడులు జరిగి 18 గంటలైనా నిందితులను పోలీసులు అరెస్టు చేయలేదని విమర్శించారు. దాడుల్లో తీవ్రంగా గాయపడిన బాధితులపై జాలి చూపించాల్సిన పోలీసులు అక్కడ నిందితులపై చూపారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటంలో పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. క్రైస్తవులపై జరిగిన దాడులను ఏ పార్టీ నేతలు ఖండించలేదన్నారు. దాడులపై అసెంబ్లీలో చర్చ జరగలేదన్నారు. మత మైనారిటీలపై జరిగే అన్ని దాడులు రాజ్యాంగ వ్యతిరేకమన్న ఆయన గుడి,చర్చి, మసీద్ మత ప్రచారకులపై జరిగే దాడులను ఎస్పీ బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రార్థన మందిరలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని అన్నారు.

# రైతుల అణచివేతకు పాల్పడుతున్నది మోదీ ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దులలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం క్రూరమైన అణచివేతకు పాల్పడుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె. నారాయణ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల బాధల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రైతుల నిరసనకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వ భారీ పోలీసు-సైనిక అణిచివేతను నిరసిస్తూ ట్యాంక్ బండ్ అంబేదర్ విగ్రహం వద్ద సోమవారం సీపీఐ భారీ ప్రదర్శన నిర్వహించింది. సీపీఐ శ్రేణులు ఎర్ర జెండాలు, ప్లకార్డులు చేతబూని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ, ఆందోళనలు చేస్తున్న రైతు సమాజానికి సంఘీభావం తెలిపారు. ఈ నిరసనలో డా.కె. నారాయ-ణతో పాటు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, కలవేణి శంకర్, ఎన్. బాలమల్లేష్, ఈటీ నరసింహ, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రైతుల ఆందోళనను అణిచివేయాలనే ధోరణితో మోదీ ప్రభుత్వం ముందుకుసాగుతుందని, పోలీసులతో పాశవికంగా దాడులు చేయిస్తూ హత్యాకాండను సృష్టిస్తుందని ఆరోపించారు. పంజాబ్-హర్యానా సరిహద్దులో నిరసన తెలుపుతున్న రైతుపై జరిగిన పోలీస్ కాల్పుల్లో శు భకరన్ సింగ్ అనే రైతు మృతి ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై హత్య కేసు నమోదు చేయాలని అయన డిమాండ్ చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రధాని మోదీ తప్పుడు వాగ్దానాలు చేసి, రైతులను పరిగణనలోకి తీసుకోకుండా రైతు వ్యతిరేక చట్టాలను ప్రయోగించి బడా వ్యాపారులకు వ్యవసాయాన్ని అప్పగించే ప్రయత్నాలను బీజేపీ ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. పంటలకు కనీస మద్దతు ధరపై కేంద్రం చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే దేశ వ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (తీన్మార్ న్యూస్): ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైసేషన్ స్కీం) దరఖాస్తులను మార్చి 31లోపు క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. లేఔట్లు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు వీలు కల్పించింది. దాంతో 20 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. దేవాయల, వక్ఫ్ భూములు, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములు తప్పా, ఇతర భూముల రెగ్యులరైజేషన్ కు అడ్డంకులు తొలగినట్లయింది. లేఔట్ల భూములను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ విధానాన్ని తీసుకొచ్చింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ వల్ల స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరింది. అనుమతి లేకుండా చేసిన లే అవుట్లలో కొనుగోలు చేసిన వారికి క్రమబద్ధీకరించుకునేందుకు సర్కార్ మరోసారి అవకాశం కల్పించింది. అనధికార లే ఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇళ్లు నిర్మాణానికి అనుమతులు రాక, అటు అమ్ముకునేందుకు వీలు లేకుండా ఉండేది. ఈ క్రమంలో ఆ లే ఔట్లలో ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించడానికి గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీం తీసుకొచ్చింది. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీం ప్రకటించడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ధరఖాస్తులు వచ్చాయి. ఈ విషయంపై కొందరు కోర్టులను ఆశ్రయించడంతో కొంతకాలం నుంచి ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం లే ఔట్ల కోసం ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 31లోగా క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. ఎల్ఆర్ఎస్కు ధరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములు, చెరువు శిఖం భూములలో ఉన్న లే అవుట్లకు అనుమతి ఇవ్వకూడదని, వాటిని స్కీంలో నుంచి తొలగించారు. కోర్టు కేసుల్లో ఉన్న భూములకు సైతం ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అనుమతించలేదు. కొన్ని చోట్ల ప్రభుత్వ భూములను ఆక్రమించి లే ఔట్లను వేయడంతో ప్రభుత్వ భూములను, చెరువు శిఖం భూములను కాపాడేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేవలం అనుమతి లేని లే ఔట్లను మాత్రమే ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా రెగ్యులరైజేషన్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# శ్రద్ధను కబళిస్తున్న క్షుద్ర ప్రభావాలు

'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అని పండిత సూక్తి. శ్రద్ధ వల్లనే జ్ఞానం లభిస్తుందని అర్థం. పిల్లలకు చదువు రావట్లేదు అంటే, కిందకి పరీక్షల్లో కంటే మార్కులు తగ్గినాయంటే, హెూం వర్క్ అసైన్‌మెంట్ హ్యాండ్ రైటింగ్ ఏదీ సరిగ్గా చేయట్లేదంటే, ఆకతాయిలతో జట్టు కడుతున్నారంటే, ఆగమాగం అవుతున్నారంటే, అటు పేరెంట్సూ ఇటు టీచర్సూ ముక్తకంఠంతో వ్యక్తం చేసే అసహనం 'పోరల్లో శ్రద్ధ చచ్చింది, వీళ్లు బాగుపడరు' అనే. శ్రద్ధ ఉంటేనే కదా! అది లేకుండాపోయింది లేదా క్షీణించిందనేది నా అభిప్రాయం. అందుకే తల్లిదండ్రులతో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో యాజమాన్యాలతో నేను గట్టిగా మొరపెట్టుకునేదేమంటే బాలబాలికల్లో అందరికీ సమానంగా ఉండకపోవచ్చు, వాళ్లు శ్రద్ధను కోల్పోవచ్చు, కానీ శ్రద్ధ లేకుండా ఎవరూ ఉండరు, శ్రద్ధ చావదు అని. మరి, శ్రద్ధ ఎందుకు కోల్పోతున్నారో, శ్రద్ధ ఎందుకు లేకుండాపోతుందో మనం క్షుణ్ణంగా మాట్లాడు కోవాల్సివుంది. ఎందుకంటే శ్రద్ధ ఏకాగ్రత సావధానత పేరేదైనా ఆ సద్గుణం లోపిస్తే చదువొక్కటే కాదు, ఏ పనీరాదు, చేయలేం. వైఫై సౌకర్యంతో సోషల్ మీడియా, బతుకుల్లోకి వెల్లువలా చొచ్చుకొచ్చిన ఆధునికత తాలూకు అనేక విషమాంశాలు పిల్లల ఏకాగ్రత మీదా, అవగాహనా సామర్థ్యం మీదా గొడ్డలి పెట్టుగా మారాయి. ఇంతకు ముందు నలభై, యాభై నిమిషాల పాటు తధేకంగా పాఠం విన్న విద్యార్థులు ఇప్పుడు క్లాసులో నాలుగైదు నిమిషాలు కూడా నిలకడగా కూర్చోలేకపోతున్నారు. ఏకాగ్రత, నిమగ్నత, కార్యోన్ముఖత పూర్తిగా దెబ్బతిని విద్యకు ఆవలి ప్రతికూల ప్రభావాల వైపు పడిపోతున్నారు. జీవితానికి అత్యవసరమైన చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆసక్తి మచ్చుకైనాలేని మందబుద్ధులుగా మారుతున్నారు. పిల్లల్లో శ్రద్ధ చచ్చిపోయిందనే తీవ్ర దూషణకూ కారణం అవుతున్నారు. అత్యంత గొప్పకాలాన్ని విలువల క్షీణయుగంగా ఇచ్చకొద్ది మార్చేస్తున్నారు. ప్రముఖ రచయిత్రి బ్రియన్నా వీస్ట్ చెబుతున్నట్టు నైపుణ్యాల దిశను వీడి స్వీయ విధ్వంసం వైపుకు పిల్లలు వాలిపోతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితిలో పెద్ద వాళ్లంగా మనం చేయగలిగింది, చేయాల్సింది, చేయించగలగింది చేస్తే తిరిగి వాళ్ల శ్రద్ధను వాళ్లు పొందగలిగేలా ఏకాగ్రతను పునరుద్ధరించుకుంటారనేది నాకున్న విశ్వాసం, బలమైన నమ్మకం. మానసిక శాస్త్ర నిపుణులు సైతం ఇదే చెబుతున్నారు. ప్రపంచీకరణ అనంతర పరిణామాల నేపథ్యంలో విద్యా దృక్పథం మారిన సంగతి మనకు తెలిసిందే. బట్టీ కొట్టేదో జ్ఞాపకం పెట్టుకుని పరీక్షల్లో జవాబుల రూపంలో వాంతి చేసుకొని మరచిపోయేదో కాదు విద్య, ఆగామి నాయకులను, ఆలోచనా బృందాలను, మేధో ప్రచారకులను విద్య సమాజానికి అందించాల్సి వుంది. నూతన జాతీయ విద్యా విధానం ఘోషిస్తున్నట్టు సమాజ పరివర్తన, సమాజ రూపాంతరం రెండూ విద్య ద్వారా జరగాల్సిన మహెూన్నత కార్యక్రమాలు. ఏ శ్రద్ధాలేని కొత్తతరంతో 'పరివర్తన, రూపాంతరం' వంటి తాత్విక భావనలు, అవి నెరవేర్చే సమాజ నిర్మాణం ఎట్లా సాధ్యమవుతుందనేదే చిక్కు ప్రశ్న. ప్రసార మాధ్యమాల పరంగా ఇది ఫ్లాషీ వీడియోల, అంతంలేని నోటిఫికేషన్ల యుగం. శ్రద్ధ గురించి ఇప్పుడు యువత ఆందోళన చెందడంలేదని చెప్పలేం. ఒక్కో తరగతిపైకి వెళున్నకొద్దీ ఇవాళ్టి పిల్లల్లో ఆందోళన మరింత హెచ్చుతుంది. తీవ్రమైన శ్రద్ధా సంక్షోభంలో తాము ఎందుకు జీవిస్తున్నామనే విషయంలో యువత మరింత చికాకుపడుతున్నారు. శ్రద్ధా పునరుద్ధరణకై పూనుకున్న యువకులు చెపుతున్నదేమంటే- తమ మెదడు ఒక పని నుండి మరొక పనికి మారినప్పుడు మనోవ్యవస్థను పునర్నిర్మించవలసి వస్తుందని, ఇంతకు ముందు ఏం చేశావెూ గుర్తుంచుకోవాలి, అదే పని గురించి ఏమనుకున్నావెూ గుర్తుంచుకోవాలి. ఈక్రమంలో పనితీరు బలహీనపడుతుంది. వేగం స్తంభిస్తుంది. ఆన్‌స్క్రీన్ ఒకదాంట్లోంచి మరొక ప్లాట్ ఫాంకు మారడం మూలంగా తదుపరి అవసరమైన పని ఆగిపోతుంది. ఏం తోచదు అంటున్నారు టీనేజర్స్. దీన్నే 'స్విచ్-కాస్ట్ ఎఫెక్ట్' అంటాడు జోహన్ హారీ. పని చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, పని చేస్తున్నప్పుడు టెకస్ట్‌లను, వీడియోలను తనిఖీ చేస్తే, టెకస్ట్‌లను, వీడియోలను చూడటం కోసం వెచ్చించే కొద్దిపాటి సమయాన్ని మాత్రమే కోల్పోం. తదుపరి పనిపై దృష్టి కేంద్రీకరించడానికి పట్టే సమయాన్ని కూడా కోల్పోతున్నామనేదే విద్యార్థుల ఆందోళన. విద్య పట్ల శ్రద్ధ, విషయాసక్తి సన్నగిల్లుతున్న పరిస్థితిని మసాచుసెట్స్ యునివర్సిటీ న్యూరోసైంటిస్ట్ ప్రొఫెసర్ ఎర్ల్ మిల్లర్'అభిజ్ఞా క్షీణతా నికర తుఫాను'గా అభివర్ణించాడు. అందుకే ఫ్రాన్స్, ఇటలీ, పోర్చుగల్ దేశాల్లో పాఠశాల ఆవరణల్లో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నిషేధించారు. బ్రిటన్ కూడా ఇదే నిర్ణయం తీసుకోనుంది. మిగతా దేశాలు యూరపునే అనుసరించనున్నట్టు సమాచారం.పిల్లల్నీ పెద్దల్నీ చదువుల్లోనే కాదు, ప్రతి చోట ప్రతి పనిలో ఏదో రకంగా శ్రద్ధాసక్తులకు దూరంగా కొనిపోతున్న ఈ విద్యున్మాధ్యమ ప్రసారికలను నిషేధించాలా? నియంత్రించాలా? అనే విషయంలో మీడియా నిపుణులు 'నియంత్రణ' కే తమ సమ్మతి తెలుపుతున్నారు.

ఏకాగ్రతను శ్రద్ధాసక్తులు పెంపుదలకు విద్యాలయాలు ఏం చేయాలి? పిల్లలకు ఏరకమైన మద్దతు ఇవ్వగలం? అనే సూటి ప్రశ్నకు సమాధానం ఇస్తూ ప్రముఖ పాత్రికేయులు మేఘా చతుర్వేది 'విద్యాసమాచారంతో అనుసంధానం , బైట్-సైజ్ లెర్నింగ్‌ని అమలు చేయడం, ట్రిగ్గర్‌లను గుర్తించడం , అవధాన పూర్వక ప్రణాళికా వ్యూహాలు పాటించడం , డికంప్రెషన్ పాజ్‌ల అమలు , నానో లెర్నింగ్ వంటి పద్ధతుల్లో శ్రద్ధాసక్తులను రగిలించవచ్చు' అంటారు. అమెరికాలోని ఒరెగాన్ హెల్త్ & సైన్స్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జోయెల్ టి నిగ్ చెపుతున్న దాన్ని బట్టి చూస్తే శ్రద్ధాసక్తుల కొరత పిల్లల్ని పోనుపోను 'శ్రద్ధా పూర్వక వ్యాధి కారక సంస్కృతి ' లోకి నెట్టే ప్రమాదం పొంచి వుందనిపిస్తుంది.

# తూ...తూ....మంత్రంగా సర్వసభ్య సమావేశం

**- అధికారుల అలసత్వం.... నాయకుల పర్యవేక్షణ లోపం**

**- పలు శాఖల అధికారులు గైహాజరు**




పాలకవీడు, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): పాలకీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు బుక్య గోపాల్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని తూ తూ మంత్రంగా నిర్వహించి ముగించారు. ఈ యొక్క సమావేశానికి నలుగురు ఎంపీటీసీలు ఓ పదిమంది వివిధ శాఖల అధికారులు హాజరవగా, ఎప్పటిలాగే మరి కొంతమంది అధికారులు గైర్హా హాజరు కాగా, మీడియా మిత్రుల అరాకొరా ప్రశ్నలకు, ఒకటో రెండో సమాధానాలతో సమావేశం తూ తూ మంత్రంగా ముగించారు. రెవిన్యూ శాఖ సంబంధించి 460 అంత్యోదయ కార్డులు, 7371 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు, 20 రేషన్ డీలర్ షాపులు ద్వారా ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యం పంపిణీ అందజేస్తున్నామని, మండలంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లకు 60 నుంచి 70 వరకు దరఖాస్తులు వచ్చాయని అవి పరిశీలనలో ఉన్నాయని, ధరణి పై ప్రభుత్వ ఆదేశాల మేరకు సవరణలు జరుగుతున్నాయని తెలిపారు. 2023 24 ఏసంగిలో 13వేల ఎకరాలు విస్తీర్ణంలో పంట వివరాలు ఆన్లైన్లో నమోదు చేయబడ్డాయి, రైతు భరోసా పథకంలో ఈ యాసంగిలో ఆన్లైన్ చేసిన రైతులు మొత్తం సంఖ్య 9009, పీఎం కిసాన్ సన్మానిధి పథకం ద్వారా లబ్ధి పొందుతున్న కుటుంబాల సంఖ్య 3928, పీఎం కిసాన్ సన్మానిదికి కేవైసీ తప్పనిసరి కేవైసీ చేయించుకొని వారి సంఖ్య 190 గా గుర్తించారు. రైతుబంధుని రైతు భరోసాగా నామ కరణం కాగా, మూడు ఎకరాల నుండి మూడున్నర ఎకరాల వరకు రైతుబంధు డబ్బులు వస్తున్నాయని తెలుపుతూ, 11 మందికి రైతు భీమా లబ్ధి పొందగా, మరో ఇద్దరికి



ఎల్ఐసి వద్ద ప్రాసెస్ జరుగుతుందని, మిషన్ భగీరథ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు నీరు సరిగా అందటం లేదని ఎంపీటీసీ వెంకటయ్య అధికారులను నిలదీశారు. కొన్ని గ్రామాల్లో రైతులు పైపులైను పగలగొట్టడం ద్వారా కొన్ని ఇబ్బందులు ఉన్నాయని వాటిని సవరణ చేస్తావని తెలిపారు. విద్యుత్ సమస్యలపై విద్యుత్ అధికారిని ఎంపీటీసీలు విలేకరులు ప్రశ్నించారు. మండలంలో గృహజ్యోతి పథకం కింద మొత్తం 4232 దరఖాస్తులు పరిశీలన పూర్తయిందని, 3720 సర్వీస్ మీటరు ఆధార్ తో అనుసంధానం చేయబడ్డాయని, 504 మీటర్ సర్వీసు, ఆధార్ కు మ్యాచ్ కాలేదని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా, పురాతన విద్యుత్ వైర్లను, సరిచేసి పురాతన తంబాలను మార్చాలని అధికారికి తెలిపారు. మండలంలో 30 అంగన్వాడి కేంద్రాలు ఉండగా, సొంత భావ నాలు 17, స్కూలు ఆవరణలో రెంటు ఫ్రీ లో ఉన్నవి 11, రెండు రెంట్ బిల్డింగ్స్ లు




కలవు. 30 మంది అంగన్వాడీ టీచర్ల విధులు నిర్వహిస్తుండగా, 29 మంది ఆయాలకుగాను, 23 మంది విధులు నిర్వహిస్తు న్నారు. 6 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని అలింగాపురం, బోత్తుల పాలెం, ఎల్లాపురం, బెట్టేగూడెం, సజ్జాపురం, గ్రామాలలో ఆయా పోస్టులు ఖాళీలుగా ఉన్నవి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ లక్ష్మి, ఎంపీఓ ఉదయాకర్, తాసిల్దార్ శ్రీదేవి, వైస్ ఎంపీపీ ఉపేందర్ రావు, ఎంపీటీసీ వెంకటయ్య, ఎంపీటీసీ మీసాల ఉపేందర్, ఎంపీటీసీ కవిత నీమా నాయక్, వెటర్నరీ డాక్టర్ శ్రీకాంత్, అగ్రికల్చర్ ఏవో, మిషన్ భగీరథ ఎఈ లు, విద్యుత్ ఏఈ, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్నార్ ఈజీఎస్ అధికారి ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది ఇంకా పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిలువెత్తు బంగారం ఇచ్చి మొక్కులు చెల్లింపు

**- ఎమ్మెల్యే వీరేశం వీరాభిమాని రాపోలు ఉపేందర్**





రామన్నపేట, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): నకిరేకల్ ఎమ్మెల్యే గా వేముల వీరేశం గెలిస్తే నిలువెత్తు బంగారం తెస్తానని మొక్కుకున్నారు. మొక్కినట్టు గా ఎమ్మెల్యే గా గెలువాగనే మొన్న జరిగిన జాతరకు రామన్నపేట పట్టణానికి చెందిన ఎమ్మెల్యే వీరాభిమాని రాపోలు ఉపేందర్ - సరోజ లు మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం నాడు ఎమ్మెల్యే ఇంటికి ఉపేందర్ దంపతులు వెళ్ళి ఎమ్మెల్యే దంపతులకి ప్రసాదం అందజేశారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మంచాల, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): మంచాల మండలం, జాపాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళ నిర్వహించారు. 2010- 2011 లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం జాపాల గ్రామంలో ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. జాపాలలో ఉన్నంత పాఠశాలలో ఏకమై సందడి చేసి కష్టసుఖాలు ఒకరినొకరు చెప్పుకున్నారు. ఎన్నో రోజుల తర్వాత కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. నాటి చిలిపి చేష్టలు తీపి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు.

# విద్యతోనే జీవితానికి వెలుగు

**- ఇబ్రహీంపట్నం ఎసిపి కేపివీ రాజు**




ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి26(తీన్మార్ న్యూస్): విద్యతోనే జీవితానికి వెలుగు, సమాజంలో మార్పు సాధ్యమని ఇబ్రహీంపట్నం ఎసిపి కేపివీ రాజు అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రాజమహేంద్రవరం ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లాస్ట్ మినిట్ రివిజన్ బుక్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఇబ్రహీంపట్నం ఏసిపి కె పి వీ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసిపి కె పి వీ రాజు మాట్లాడుతూ విద్యతోనే మంచి సమాజం అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులు కష్టపడి, ఇష్టంగా చదివి మంచి లక్ష్యాన్ని సాధించి ఉన్నతమైన స్థానంలో స్థిరపడాలని అన్నారు. విష సంస్కృతిని పారదోలడంతో మంచి సమాజాన్ని నిర్మించగలుగుతామని ఆయన అన్నారు. పిఆర్ఆర్ ఫౌండేషన్ విద్యార్థుల కోసం ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎంతోమంది కోట్ల రూపాయలు సంపాదించిన సేవ చేయాలని ఆలోచన తక్కువగా ఉంటారని అన్నారు. తన దగ్గర లేకున్నా ఇతరుల సహకారంతో జ్ఞానాన్ని




పెంపొందించాలని ఒక ఆశతో కాకుండా, ఆశయం కోసం ఇలాంటి వాళ్లు ముందుకు రావడం అభినందనీయమని భవిష్యత్తులో పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావు మరెన్నో సేవ కార్యక్రమాలు చేయాలన్నారు. అనంతరం పిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావు మాట్లాడుతూ ఫౌండేషన్ 2021 లో స్థాపించి 500 నుండి 3000 మంది విద్యార్థులకు అందించడానికి గత మూడు సంవత్సరాల నుండి ప్రయత్నాలు చేస్తూ విద్యార్థుల వద్దకు చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం ఐదు జిల్లాలో 3000 మంది విద్యార్థులకు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదర్శ పాఠశాలలతో పాటు బీసీ మైనార్టీ గురుకులాల్లో కూడా విద్యార్థులకు మెటీరియల్ అందించడం జరుగుతుందన్నారు. ఈ మెటీరియల్ ముద్రించడానికి సహకరించిన ఉపాధ్యాయులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో అందరి సహకారం ఉంటే మరిన్ని పాఠశాలలకు విద్యాభివృద్ధి కోసం చేయూతనివ్వడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఇబ్రహీంపట్నం తో పాటు వింజపురం మైనార్టీ గురుకుల గుర్రంగూడా మైనార్టీ విద్యార్థులకు సుమారు 300 మందికి ఈ మెటీరియల్ అందించడం జరిగిందని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో వేణుగోపాల్ సార్, సిరాజ్ షహనాజ్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెల తొలగింపుతో ఆందోళన



మహబూబాబాద్: మహబూబాబాద్ పట్టణంలోని కురవి వెళ్లే రోడ్‌లో 255/1 ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను పట్టణ పోలీసులు, పురపాలక సంఘం సిబ్బంది సహకారంతో మంగళవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఆరు నెలల క్రితం వివిధ ప్రాంతాలకు చెందిన నిరుపేదలు స్థిరాస్తి వ్యాపారుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిలో వందలాది మంది పేదలు గుడిసెలు వేసుకున్నారు. గత ప్రభుత్వంలో అధికారులు పలుమార్లు గుడిసెలను తొలగించారు. మంగళవారం తెల్లవారుజామున పోలీసులు భారీ సంఖ్యలో జేసీబీలతో వెళ్లి గుడిసెలను తొలగిస్తుండగా గుడిసెవాసులు అడ్డుకోవడంతో వారిమధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. తొలగింపును అడ్డుకున్న వారిని పోలీసులు అరెస్టు చేసి కొందర్ని ఠాణాకు తరలించారు. స్తిరాస్థి వ్యాపారులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు అధికారులు ఎందుకు అంత ఉత్సాహం చూపుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ప్రశ్నించారు. గుడిసెవాసులను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా భూ ఆక్రమణలు జరిగాయన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైందని పేదలకు ఇళ్ల స్థలాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకముందే అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. పేదలకు అండగా నిలిచిన సీపీఎం నాయకులు సీతారాంనాయక్, బానోతు వెంకన్న, బూర్గుల లక్ష్మణ్, రమేష్‌ను అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల గుడిసెలను తొలగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# 28 నుండి మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు

**-పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్**

**-నిమిషం ఆలస్యం అయితే పరీక్ష కేంద్రానికి నో ఎంట్రీ**



రామన్నపేట, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 28వ తేదీ నుండి వచ్చే నెల 14వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల సూపరిండెంటెట్ శివకోటి, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఏ.మురళి సోమవారం తెలిపారు. పరీక్షలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం 28న, ద్వితీయ సంవత్సరం 14 నిర్వహించే పరీక్షలకు 289 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఇందులో ప్రథమ సంవత్సరం 138, ద్వితీయ సంవత్సరం 151 మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, 8:45 గంటల వరకు విద్యార్థులు కేంద్రాల్లోకి చేరుకోవాలని తెలిపారు.

# నేతకాని మహర్ సంక్షేమ సంఘం వినతి

పెద్దపల్లి ఫిబ్రవరి 26:నేతకాని కుల ధ్రువీకరణ పత్రం ఆన్ లైన్ లో అచ్చు తప్పును సరిచేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ సూపరిండెంట్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. నేతకానికి బదులుగా నెట్ కానీ అనే స్పెల్లింగ్ మిస్టేక్ పడుతున్నదని వినతిలో పేర్కొన్నారు. ధృవీకరణలో అచ్చు తప్పును సవరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్యాగ. శ్రీనివాస్, గొల్లే లక్ష్మణ్, మాదాసు. సుధాకర్, రామగుండం కార్పోరేషన్ సంయుక్త కార్యదర్శి రామటెంకి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్యకు బయలుదేరిన భక్తులు



రాజాపేట, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం, చల్లూరు గ్రామం నుండి సోమవారం ప్రత్యేక రైలులో భక్తులు బయలుదేరారు. వీరికి బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కాయితి బాల్రెడ్డి, చల్లూరు మాజీ ఉపసర్పంచి బింగి శ్రీనివాసులు, రాజాపేట ఎంపీటీసీ దాచేపల్లి రాజు, బిజెపి ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రీనివాస్ నాయక్ లు ట్రైన్ వరకు వెళ్లి అయోధ్యకు సాగనంపారు. అయోధ్యకు వెళ్లిన వారిలో గణపురం నితిన్, మహేశ్వర చెంద్రశేఖర్, అయోధ్య బాలరాముని దర్శనానికి భువనగిరి నుండి రైలు లో బయలుదేరారు. వారికి క్షేమంగా వెళ్లి క్షేమంగా రావాలని కోరుకున్నారు.

# చందేపల్లి లో ఉచిత మెడికల్ క్యాంప్





మోటకొండూర్, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయమని చందేపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ మున్ని జలంధర్ రెడ్డి అన్నారు. మండలం లోని చందేపల్లి గ్రామంలో మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి వైద్యుల బృందం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 180 మందికి బిపి షుగర్ వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం వైద బృందానికి హనుమాన్ సేవ సంస్థ ఆధ్వర్యంలో భోజన వసతులు కల్పించారు. భోజన వసతి కల్పించిన హనుమాన్ సేవా సంస్థ వారికి వైద్య బృందం వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మున్ని జలంధర్ రెడ్డి డాక్టర్లు అనన్య సాయి కిరణ్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతిని అందుకున్న కొలనుపాక విద్యార్థులు



ఆలేరు, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): తెలంగాణ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలం, కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డ్రామా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతిని అందుకున్నారు.

సోమవారం హైదరాబాద్ లోని జోడిమెట్ల అనురాగ్ యునివర్సిటీ లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 18 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థులు కుమారి రక్షిత, కుమారి దీపిక, కుమారి రుచిత, కుమారి సాహితీ, మరియు కుమారి శ్రావణి లు డ్రామా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రామచంద్రయ్య, పాఠశాల ఉపాధ్యాయులు హసీనా బేగం, స్వరూపరాణి, మరియు ఇతర ఉపాధ్యాయులను రాష్ట్ర స్థాయిలో బహుమతిని పొందిన పాఠశాల విద్యార్థులను ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొడారి వెంకటేష్ అభినందించారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అడ్మిషన్ లు ప్రారంభం

**– భువనగిరి జిల్లా కి ఒక సీటు కేటాయింపు**

భువనగిరి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): 2024–25 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, (రామంతాపూర్) నందు ఎస్సి విద్యార్థిని విద్యార్థులకు (1)వ తరగతి (డే స్కాలర్ )లో ప్రవేశానికి యాదాద్రి భువనగిరి జిల్లాకు (1) సీటు కేటాయించినట్లు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. జయపాల్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. దరఖాస్తులు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల తేది. 27-02-2024 నుంచి 12.03.2024 వరకు సమర్పించాలని కోరారు. అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై తేది. 01-06-2017 తర్వాత 31-05-2018 కి ముందు జన్మించిన వారై ఉండాలని సూచించారు. జనన ధ్రువీకరణ పత్రం, కుల, వార్షిక ఆదాయం ధ్రువీకరణ పత్రం మీ సేవా నుండి జారీ చేసినదై సమర్పించాలన్నారు. లాటరీ పద్ధతి లో ఎంపిక విధానం ద్వారా తేది. 15.03.2024 న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు మరియు ధరఖాస్తు ఫారాలకు జిల్లా ఎస్సి అభివృద్ధి శాఖ కార్యాలయం, రెండవ అంతస్తు, రూమ్ నెంబర్ యస్. (17) కలెక్టరేట్ కాంప్లెక్స్ నందు సంప్రదించాలని కోరారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**– ఎమ్మెల్యే వేముల వీరేశం**

**– పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**



రామన్నపేట, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. సోమవారం రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. 15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్, పాల ఉత్పత్తిదారుల భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం రామన్నపేట మండల పరిషత్



కార్యాలయంలో మూసీ పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి పల్లి కాల్వల పనుల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ 2014 సంవత్సరంలో తాను ఎమ్మెల్యేగా ధర్మారెడ్డి పల్లి, పిల్లాయి పల్లి కాలువలకు నిధులు విడుదల చేయించానన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సంవత్సరంలోపు పనులు పూర్తి చేయాలన్నారు. నీటిపారుదల సమస్యలను మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి అదృశ్యం...

**– కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

రామన్నపేట క్రైమ్, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన బల్గూరి కృష్ణవేణి భర్త స్వామి వారి కూతురు బాల్గూరి లావణ్య వయస్సు: 19 సంవత్సారాలు, వృత్తి: స్టూడెంట్, రోజు మాదిరిగానే శనివారం నాడు ప్రాక్టికల్ ఎగ్జామ్ లు ఉన్నవనీ కళాశాల కి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన కూతురు ఆదివారం వరకు ఇంటికి రాకపోవడంతో తల్లి తన కూతురు కనిపించడం లేదని, వారి బంధువుల, చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలను విచారించగా ఆచూకీ లభించకపోవడంతో రామన్నపేట పోలీస్ స్టేషన్ లో తన కూతురు కనిపించడం లేదని, కనిపించక పోవడానికి కారణం నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, ఏపూరు గ్రామానికి చెందిన మందుల రాము తండ్రి నర్సింహా అనే వ్యక్తిపై అనుమానం ఉన్నందని పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు చేయడం జరిగిందని, అట్టి పిర్యాదు మేరకు రామన్నపేట ఎస్ఐ పి.మల్లయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# అంబేడ్కర్,జగ్జీవన్‌రామ్‌ల భవన నిర్మాణానికి స్థలాన్ని సేకరించాలి

యాచారం, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): యాచారం మండలంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ భవన నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టాలని ఇబ్రాహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలో ఈ భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ భవన నిర్మాణ సాధన సమితి అద్వర్యంలో సోమవారం రోజు ఇబ్రాహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని తన నివాసం లో కలిసి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిశ దశను చూపించిన మహానుభావుడన్నారు. అదేవిధంగా బాబూ జగ్జీవన్‌రామ్ దేశ ఉ పప్రధానిగా ఉండి భారతదేశ అభ్యున్నతికి ఎనలేని సేవ చేశారన్నారు. ఆ మహానుభావుల పేరుతో మండలంలో భవనం నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. భవన స్థలానికి,భవన నిర్మాణ నిధులు మంజూరి కోసం వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కి నాయకులు ప్రత్యేక క్రుతజ్ఞతలు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమములో డా బి ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రాం భవన నిర్మాణ సాధన సమితి కన్వీనర్ బోడ క్రిష్ణ, కో కన్వీనర్లు సిద్దపురం శ్రీకాంత్, జోగు క్రిష్ణ బండిమీది క్రిష్ణ, కాళ్ళ జంగయ్య, చింతుల్ల సాయిలు, జోగు అంజయ్య, యంజాల అంజయ్య, కొండాపురం క్రిష్ణ, కంబాలపల్లి సాయిలు, కందికంటి ఆనంద్, కందుకూరి బాల్ రాజు, తాండ్ర మహేష్, ముచ్చర్ల వెంటట్ రమణ, యంజాల యాదయ్య, పంది సుదాకర్, కొండాపురం యాదయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.



# చిన్న మేడారం జాతర హుండీ లెక్కింపు

**– ఆదాయం రూ.10.3 లక్షలు**





రాజాపేట, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం, చిన్న మేడారం హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గద్దెల ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. హుండీలలో భక్తులు నగదు రూపంలో 6 లక్షల 3 వేల రూపాయలను సమర్పించు కోగా, 10 గ్రాముల మిశ్రమ బంగారం 50 గ్రాముల మిశ్రమ వెండి వస్తువులు కూడా వచ్చినట్టు, వివిధ కైకర్యాల ద్వారా రూ. 4,27,000 ఆదాయం వచ్చినట్లు మొత్తం 10 లక్షల 30 వేల రూపాయలు ఆదాయం చేకూరిందని నిర్వాహకులు తెలిపారు.

# సీనియర్ జర్నలిస్ట్ ఏటేల్లి శ్రీనివాస్ ను పరామర్శించిన ఎమ్మెల్యే వేముల



రామన్నపేట, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సూర్య ప్రభంజనం దిన పత్రిక ఎడిటర్ ఏటెల్లి శ్రీనివాస్ ను నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం సోమవారం ఆయన నివాసంలో శ్రీనివాస్ పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, పున్న జగన్మోహన్, మందడి రవీందర్ రెడ్డి, మందడి ప్రభాకర్ రెడ్డి, గుత్తా నర్సింహారెడ్డి, గోదాసు పృథ్వీరాజ్, జెల్లా వెంకటేశం, ఎంపీటీసీలు ఎండి రెహాన్, తిమ్మాపురం మహేందర్ రెడ్డి, ఎండి అక్రమ్, గౌలుసుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి

**– రాష్ట్ర నాయకులు గుంటి మధుసూదన్ రెడ్డి డిమాండ్**



రాజాపేట, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీకి రావలసిన పెండింగ్ బిల్లు విషయంలో 18 నెలల నుంచి ఎస్ఈ ఐదు మాసాల నుంచి గుంటూరు ఫైనాన్స్ రెండు సంవత్సరాల 10 ఆర్ జి ఎస్ క్రీడా ప్రాంగణాలు స్మశాన వాటికలో పల్లె ప్రకృతి వనం నర్సరీలకు సంబంధించిన వెల్డింగ్ బిల్ వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ముందుకు పోదామని, నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, రాజపేట కాజా మాజీ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కంచర్ల, శ్రీనివాస్ రెడ్డి, పెరు మాండ్ల కిషన్, ఇంజలక్ష్మి, బూరుగు భాగ్యమ్మ, నాగిర్తి గోపాల్ రెడ్డి, మూడవత రాములు, సీనియర్ సర్పంచ్ వంచ వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ ఎక్సెల్లెన్సీ అవార్డు గ్రహీత జర్నలిస్టు యంబ నర్సింహులు కు టిజె యు సన్మానం

భువనగిరి, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): జిల్లాలో సాక్షి తెలుగు దినపత్రిక లో జిల్లా స్టాపర్ గా పనిచేస్తున్న యంబ నరసింహులుకు 2024 సంవత్సరానికి సాక్షి యాజమాన్యం ప్రింట్ మీడియా విభాగంలో సాక్షి ఎక్సెల్లెన్సి అవార్డు పొందారు. ఈ సందర్భంగా సోమవారం రోజున తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ మరియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వారికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్న బత్తిని మత్యాస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపరాజు వెంకన్న పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఊట్కూరి అశోక్ గౌడ్

రాజాపేట, ఫిబ్రవరి 26(తీన్మార్ న్యూస్): రాజాపేట మండల కేంద్రానికి చెందిన ఊట్కూరి అశోక్ గౌడ్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ ఆధ్వర్యంలో ఈ నియామకం జరగగా, ఆర్ఎస్ఎస్ ఏబీవీపీ బిజెపి పార్టీలతో విడదీయని బంధం ఉన్న ఊట్కూరి అశోక్ గౌడ్ గత కొన్ని సంవత్సరాల నుండి జిల్లా ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు.

పార్టీ అభివృద్ధి కోసం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ అయన తక్కువ కాలంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. అశోక్ నియామకం పట్ల పలువురు అభినందించారు.



# మెడికల్ వ్యాల్యూ టూరిజం డెస్టినేషన్‌గా హైదరాబాద్

## మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్ : రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా హెల్త్ మినిస్టర్ అంబర్ జెడ్ సందర్సన్, గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్‌కు చెందిన ఉన్నత స్థాయి అధికారుల బృందం హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో సమావేశమయ్యారు. గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియాలో మెడికల్, పారామెడికల్ హెల్త్ కేర్ రంగాలలో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహతో చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డాక్టర్ కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ద్వారా నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏటా 8515 మెడికల్ గ్రాడ్యుయేట్స్, 6880 మంది నర్సింగ్ గ్రాడ్యుయేట్స్‌తో పాటు 22,970 మంది పారా మెడికల్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేస్తున్నారని మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ నగరం మెడికల్ వ్యాల్యూ టూరిజం డెస్టినేషన్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందినట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో TOMCOM (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్) ద్వారా నర్సింగ్, పారామెడికల్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రొఫెషనల్స్‌గా శిక్షణ ఇచ్చి వారు ప్రపంచంలో ఎక్కడైనా ఉ ద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి చర్యలు తీసుకున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రానికి చెందిన మెడికల్, పారా మెడికల్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడానికి గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియాతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి దామోదర రాజనర్సింహ గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా వైద్య శాఖ మంత్రి అంబర్ జెడ్ సందర్సన్ కు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా హెల్త్ మినిస్టర్ అంబర్ జెడ్ సందర్సన్‌ను ఘనంగా సన్మానించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్ వి కర్ణన్, TOMCOM సీఈవో డా. విష్ణువర్ధన్ రెడ్డి, ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ హైమావతి, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో విశాలాక్షి, డాక్టర్ వాణి డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (అడ్మిన్), డాక్టర్ శివరామ ప్రసాద్ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకాడమిక్) నిమ్స్ డైరెక్టర్ బీరప్పలతో పాటు గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా డిపార్ట్మెంట్ ఆఫ్ హెల్త్ మినిస్టర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ – స్టేసీ హోర్న్, డిపార్ట్మెంట్ ఆఫ్ హెల్త్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ – జోడి సౌత్, ఇన్వెస్ట్మెంట్ అండ్ ట్రేడ్ కమిషనర్ ఇండియా–గల్ఫ్, ఇన్వెస్ట్ అండ్ ట్రేడ్ గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా – నషీద్ చౌదరీలు పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో సీఐటీయూ నిరసన



రామగిరి : యువ రైతును మట్టుబెట్టిన దానికి నిరసనగా రామగిరి సీఐటీయూ మండల కమిటీ ఆద్వర్యంలో నల్లజెండాలతో నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యాకడు దొమ్మటి కొమురయ్య హాజరై మాట్లాడారు. బీజేపీ కేంద్ర, హర్యానా ప్రభుత్వాలు యువ రైతు శుభకరన్ సింగ్ ను పంజాబ్ బార్డర్ లో క్రూరంగా హత్య చేశాయనీ, దీనికి నిరసనగా ఫిబ్రవరి 23న బ్లాక్ డే అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో, పని ప్రదేశాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిర్వహించాలని అన్నారు. అలగే జాతీయ రైతు సంఘాల పిలుపులో బాగంగా నిరసన వ్యక్తం చేయడం జరిగిందని. భట్టిండా జిల్లా, బల్లో గ్రామం, చరణ్‌జిత్ సింగ్ కుమారుడు, 23 సంవత్సరాల వయస్సు గల యువ రైతు శుభకరన్ సింగ్ మృతి పట్ల ఎస్ కె ఎం, జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా పంజాబ్‌లోని ఖన్నోరీ సరిహద్దులో మొన్న (ఫిబ్రవరి 21) ఆయనను పోలీసులు కాల్చి చంపారు. నివాళులు అర్పించాలని రైతులు, కార్మికులతో సహా దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు, సంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాం అనీ అన్నారు.

ఈ కార్యక్రమంలో హామెద్ పాషా మండల కన్వీనర్ ఎండి అహ్మద్ పాష, నాయకులు ఎం వెంకటేశ్వర్లు, ఎం ప్రభాకర్, ఎన్ రాజయ్య, బి రాజమల్లు, ఎన్ తిరుపతి, ఎం డి హబీబ్ పాషా,ఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ డ్యాముల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి: ఆది శ్రీనివాస్

**– వర్షాకాలం రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలి**

**– కోతకు గురైన చెరువులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి**



వేములవాడ: జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో ఆదివారం ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలకు మూలవాగు పై నిర్మించిన చెక్ డ్యాం ల దగ్గర వరదకు దెబ్బతిన్న పొలాలు భవిష్యత్తులో మళ్లీ వరద తాకిడికి ఇబ్బంది కాకుండా పర్యవేక్షణ జరిపి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కొనరావుపేట మండలం నిజామాబాద్,మామిడిపల్లి గ్రామల మధ్యలో నిర్మించిన చెక్ డ్యామ్ దగ్గర మరొకసారి వరద కోతకు గురికాకుండా కట్టల నిర్మాణం చెక్ డ్యామ్ ఎత్తు తగ్గింపు గురించి విచారించి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు తెలిపారు. అదేవిధంగా వేములవాడ మండలం బొల్లారం,లింగంపల్లి మధ్య నిర్మించిన చెక్ డ్యాం,జయవరం దగ్గర నిర్మించిన చెక్ డ్యాం దగ్గర దెబ్బతిన్న పొలాలు మరియు కోతకు గురైన పొలాలు తిరిగి యధాస్థితి కి తీసుకురావడనికి గల అంచనాలు రూపొందించడానికి చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన చెక్ డ్యాములకు సంబంధించి, మరిమడ్ల,నిమ్మపల్లి, కొండాపూర్,వెంకటరావుపేట, మామిడిపల్లి పరిదిలోని నిర్మాణంలో చెక్ డ్యాం లు సంబంధించి భవిష్యత్తులో వరదలకు ఇబ్బంది కాకుండా నిర్మాణాలను చేపట్టాల్సిందిగా సూచించారు. వేములవాడ పట్టణ పరిధిలోగల మల్లారం ఆనకట్ట నుండి గుడి చెరువుకు వచ్చే కట్టు కాలువ బుడగజంగాల కాలనీ వద్ద కాలనీ ముంపు గురవుతున్న విషయాన్ని ప్రస్తావించి కాలువలో గల పూడికతీయుట పై నుండి వచ్చే వరద మూలవాగులో వెళ్లి కలిసే విధంగా బుడగ జంగాల కాలనీ వద్ద నిర్మాణం చేపట్టాల్సిందిగా అన్నారు. పట్టణంలో గల మురికి కాలువలు గుడి చెరువులో కలవకుండా మూలవాగు వరకు కాలువలు నిర్మించుట కొరకు వేములవాడ మున్సిపల్ కమిషనర్ తో,కలిసి పరిశీలించి అంచనాల రూపొందించాల్సిందిగా అధికారులను తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా లో మధ్య మానేరు నుండి అప్పర్ మానేరు వరకు నీరందించే ప్యాకేజీ–9 కి సంబంధించి పనుల పురోగతి తెలుసుకొని సింగసముద్రం చెరువు నుండి అప్పర్ మానేరు ప్రాజెక్టు వరకు గల బ్యాలెన్స్ పనులను,మలకపేట రిజర్వాయర్ యొక్క కుడి ఎడమ కాలువలు పూర్తి అవ్వడానికి కావలసిన నిధుల విడుదల గురించి ముఖ్యమంత్రి తో చర్చించడానికి కావాల్సిన నివేదికనలను పరిశీలించారు. బ్యాలెన్స్ పనులను పూర్తి చేస్తే తక్షణం 20 వేల నుండి 30 వేల ఎకరాల వరకు ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలోనే బాల్కొండ డివిజన్ పరిధిలో ఉన్న రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ తూముని,రెండు కిలోమీటర్ల కాలువని ఈ జిల్లా పరిధిలో ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కి అప్పగింత వల్ల నీటి యాజమాన్యం సులభంగా జరిగి ఎగువన ఉన్న బాల్కొండ నియోజకవర్గం లోని కోనాపూర్ గ్రామ ఆయకట్టుకి నీటిని అందించే బాధ్యతతో పాటు, వేములవాడ నియోజకవర్గం లోని భూషణ్రావుపేట్ ఊటపల్లి,చింతకుంట,కథలాపూర్ గ్రామల రైతులకి సాగునీరు అందించడం కోసం ఇంజనీర్ ఇన్ చీఫ్, నీటిపారుదల శాఖ, హైదరాబాద్ కి ఉత్తరం రాయాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులకి సూచించడం జరిగింది. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకి కథలాపూర్,మేడిపల్లి భీమారం మండలాలలో కోతకి గురి అయిన చెరువుల మరమ్మత్తులకి సంబంధించి వివిధ స్థాయిలో ఉన్న అంచనాలని త్వరితగతిన ఆమోదించి వచ్చే వర్షాకాలం లోపు చెరువుల మరమ్మత్తులను పూర్తిచేయాలని అధికారులని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ శివకుమార్,ఈఈ గంగం శ్రీనివాసరెడ్డి, ఈఈ అమరేందర్ రెడ్డి, సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# భారీగా డ్రగ్స్ సీజ్.. బీజేపీ నేత కుమారుడు అరెస్ట్!

హైదరాబాద్: నగరంలోని గచ్చిబౌలిలో భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఈ క్రమంలో డ్రగ్స్‌తో సంబంధం ఉన్న బీజేపీ నేత కుమారుడితో సహా మరో ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు పోలీసులు. కాగా, ఓ బీజేపీ నేత కుమారుడు నిన్న రాత్రి కొందరికి విందు ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో విందులో కొకైన్ తీసుకున్నట్టు గుర్తించారు. ఇక, హోటల్‌లో కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దీంతో బీజేపీ కుమారుడితో సహా మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారు ముగ్గురు గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో ఉన్నారు.

# పోలీస్ అధికారులు.. మీ సేవలకు సలాం



ములుగు/తాడ్వాయి: విధి నిర్వహణలో కఠినంగా ఉండే కాకీలు.. కష్టాల్లో ఉన్నవారికి సాయం అందించేందుకు ప్రాణాలు లెక్క చేయకుండా సహాయం చేస్తారని ఈ సంఘటన రుజువు చేస్తుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ పట్టణానికి చెందిన రోహిత్ లాల్ (21) ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతరకు వచ్చి చిలకలగుట్ట వెనుక భాగంలోని దయ్యాల మడుగు ప్రదేశంలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. సమాచారం అందుకున్న సీసీఎస్ సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్బీఐ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కానిస్టేబుల్ శంకర్ ప్రాణాలకు తెగించి రెండు గంటలపాటు మృతదేహం కోసం ముమ్మరంగా గాలించి ఎట్టకేలకు మృతుడిని గుర్తించారు. సంఘటనా స్థలానికి వాహనం వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రెండు కిలోమీటర్ల మేర స్వయంగా మోస్తూ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు చేసిన సాహసం, సహాయం ప్రతి ఒక్కరి అభినందనలు అందుకుంది. కాగా మృతదేహాన్ని అందుకున్న బంధువులు.. పోలీస్ అధికారులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఏదిఏమైనా పోలీస్ అధికారుల పనితీరు, కష్ట సమయంలో చూపిన మానవత్వం అందరి మన్ననలను అందుకుంది.

# ఘనంగా సద్గురు సంతు రవిదాస్ మహారాజ్ జయంతి వేడుకలు



రామగిరి : సద్గురు సంతు రవిదాస్ మహారాజ్ జయంతి ఉత్సవాలు మండలంలోని రామయ్యపల్లి గ్రామంలో (బుధవారంపేట) లో సంతు రవిదాస్ మహారాజ్ జయంతి ఉత్సవాలను సంతు రవిదాస్ భక్తి మార్గ సౌత్ ఇండియా కమిటీ సభ్యులు కన్నూరి శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగిరి మండల ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమరయ్య గౌడ్ హాజరై మాట్లాడార. 600 సంవత్సరాల క్రితమే అందరూ భగవంతుని చేరుకోవచ్చు అనే సందేశాన్ని ఇచ్చి విశ్వ గురువుగా మారిన సంతు రవిదాస్ మహారాజును ఈ సమాజం ఆదర్శంగా తీసుకోవాలని ఆమె అన్నారు. అదేవిధంగా వందల సంవత్సరాల క్రితమే మీరాబాయి, లాంటి జ్ఞానవంతురాలు అయిన మహిళలు కూడా సొంత రవిదాస్ భక్తురాలుగా శిష్యురాలుగా మారిపోవడం అంటే ఆయన ఎంత గొప్పవారో అర్థమవుతుందని, అలాంటి మహనీయుని ఆశయాలను మనం నెరవేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవనూరి శ్రీనివాస్ రజిత, ఉప్పరి సంఘం నాయకులు కాటుపల్లి శంకర్, రేషన్ డీలర్ల సంఘ సభ్యులు కన్నూరి మల్లేష్, గాండ్ల అనిల్, రాజు, సమ్మయ్య, రాహుల్, అడ్డూరి మల్లయ్య, కన్నూరి రాకేష్, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

# డి83 కెనాల్ నుండి సాగునీరు అందించాలి

## దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

## సీఈ సుధాకర్ రెడ్డిని ఆదేశించిన మంత్రి



సాగు నీరు అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

మల్హార్ రావు: మంథని ప్రాంత రైతులకు డి83 కెనాల్ గుండారం నుండి కమాన్ పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాల గ్రామాల రైతుల పొలాలకు వెంటనే మంగళవారం నుంచి సాగు నీరు అందించాలని చీఫ్ ఇంజనీర్ (సిఈ)సుధాకర్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సోమవారం ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డి83 పైనుండి వదిలే వాటర్ ను అక్కడక్కడ మోటర్లు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోటర్లు పెడుతున్నట్లు తెలిసినందున ఎలాంటి పర్మిషన్ లేని మోటర్లకు కరెంట్ కట్ చేసి రైతులకు నీళ్లు అందించాలని సిఈని ఆదేశించారు. గుండారం రిజర్వాయర్ నుండి వెంటనే నీటి విడుదల చేసి రైతుల పొలాలకు ఎలాంటి నష్టం జరుగకుండా రేపటి ఉదయం రైతులందరి పొలాలకు

# డేంజర్ జోన్లో ఉన్న ఇండ్లు, భూములకు పరిహారం ఇవ్వాలి

**– తాడిచెర్ల ఓసీపీలో భూ నిర్వాసితుల ఆందోళన**



మల్హార్ రావు: తాడిచెర్ల కాపురం బ్లాక్–1ఓసీపీకి 500 మీటర్లు డేంజర్ జోన్లో ఉన్న సుమారుగా 2,800 ఇండ్లకు,భూములకు నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజి ఇస్తూ, సురక్షితమైన ప్రాంతంలో పునరావాసం ఏర్పాటు చేయాలని సోమవారం తాడిచెర్ల భూ నిర్వాసితులు ఓసీపీ మైన్ లో ఆందోళన,నిరసన చేపట్టారు. నిర్వాసితులను పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. అయిన నిర్వాసితులు మైన్ లోకి వెళ్లి బైఠాయించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడారు. ఓసీపీకి డేంజర్ జోన్లో ఉన్న ఇండ్లకు టిఎస్ జెన్కో కంపెనీ ఇంటి నెంబర్లు కేటాయించి,14–12–2022న పలు దినపత్రికల్లో ప్లినిమరి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇట్టి నోటిఫికేషన్ కాలపరిమిది 12 నెలలు మాత్రమే కానీ రెండు నెలలు కాలపరిమితి ఉండగానే సంబంధించిన జిల్లా కలెక్టర్ కు దృష్టికి తీసుకవెళ్లినట్లుగా తెలిపారు. దీనికి జిల్లా కలెక్టర్ జెన్కో కంపెనీ అధికారులు ఇంకా డబ్బులు వేయలేదని చెప్పడం జరిగిందన్నారు. తాడిచెర్ల ఓసిపిలో బ్లాస్టింగ్ బాంబుల దెబ్బలతో ఇండ్లు నెలమట్టమై, ఇంటి గోడలు భారీగా పగుళ్లు తెలుతున్నాయని, బ్లాస్టింగ్ వల్ల రసాయన విషపు వాయువుతో ప్రజలకు ఊపిరితిత్తుల, క్యాన్సర్, గుండె జబ్బులు తదితర వ్యాధుల బారిన పడి చనిపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా నిర్వాసితుల సమస్యలను పరిస్కారమార్గం చూపేలా చర్యలు తీసుకోవాలని జెన్కో ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.

# రుద్రారంలో యథేచ్ఛగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు

**– రూ. 13 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం**

**– మంత్రి దుద్దిళ్ల ఆదేశాలతో వైస్ ఎంపీపీ బడితేల స్వరూప రాజయ్య**

**– ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

మల్హార్ రావు: మండలంలోని రుద్రారం గ్రామంలో అభివృద్ధి పనులు గత రెండు వారాలుగా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గత ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోక, పెండింగ్ లో ఉన్న పనులను తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు ఆదేశాలతో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు బడిటితేల స్వరూప రాజయ్య దంపతులు అంటున్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్య6 ప్రమాణాలు పాటించేలా దగ్గర ఉండి చేయిస్తున్నట్లుగా తెలిపారు. ఇటీవల 10వ వార్డులో 2018 నుంచి పెండింగ్ లో ఉన్న మోరి,మెటల్ రోడ్డు పనులు చేయించిన విషయం తెలిసిందే. సోమవారం 5,6 వార్డుల్లో మెరుగు రాజబాబు ఇంటి నుంచి మాచర్ల రాజయ్య వరకు, బిముని వెంకట స్వామి ఇంటి నుంచి సుశీల ఇంటి వరకు రూ. 8 లక్షలు జెడ్పి నిదువు, రూ. 3 లక్షలు డిఎంఎఫ్టి నిధులతో 200 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ బడితేల స్వరూప రాజయ్య ప్రారంభించారు. గ్రామంలో అభివృద్ధి పనులు చకచకా నడువడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సంగ్గెం రమేష్,గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధియే తమ లక్ష్యం: బడితేల స్వరూప రాజయ్య ఎంపీటీసీ దంపతులు.. రుద్రారం గ్రామంలో తాగు నీరు,వాడవాడకు సీసీ రోడ్లు,డ్రైనేజీలు తోపాటు మౌలిక వసతులు కల్పించడమే తమ ద్యేయం. గ్రామంలో అభివృద్ధి పనులు తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు సహకారం, ఆదేశాలతోనే చేపడుతున్నాము.



# రైతులు చచ్చిపోయారంటూ.. రూ.2 కోట్లు కొట్టేసిన AEO




కొందుర్గ్ : గొర్రెల పంపిణీ స్కామ్ మరువక ముందే రాష్ట్రంలో మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రైతుబంధు, రైతుబీమా డబ్బులు కాజేసిన కొందుర్గ్ మండల వ్యవసాయ అధికారి గోరేటి శ్రీశైలంను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి మీడియాతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. కొందుర్గు మండలంలోని వెంకిర్యాల,తంగళ్ళపల్లి, అగిర్యాల,చిన్న ఎల్కిచేర్ల గ్రామాలకు ఇంచార్జిగా ఉన్న శ్రీశైలం.. బతికున్న20 మంది రైతులను చంపేసి వారి పేరిట నకిలీ పత్రాలు సృష్టించి బీమా తీసుకున్నారని తెలిపారు. రెండు వేల మంది అమాయక రైతుల డేటా ను సేకరించినట్లు గుర్తించామని అవినాష్ మొహంతి తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం మరణించిన రైతులకు బీమా కింద రూ.5 లక్షలు, రైతుబంధు కింద పెట్టుబడి కోసం ఎకరాకు ఏటా రూ.10 వేల చొప్పున సాయం అందిస్తోంది. అయితే దీన్నే అవకాశంగా మలుచుకున్న కొందర్గు మండల వ్యవసాయ శాఖలోని అధికారులు తమ పరిధిలోని 20 మంది రైతుల వివరాలను సేకరించి వారు మరణించినట్లుగా తప్పుడు నకిలీ పత్రాలు సృష్టించి రైతు బీమాకు దరఖాస్తు చేసుకుని దాదాపుగా కోటీ రూపాయిలు స్వహా చేశారు. రైతు బీమా కింద ఇచ్చే పరిహారాన్ని ఎల్ఐసీ చెల్లిస్తుంది. ఆ క్లెయిమ్ ల చెల్లింపులకు సంబంధించి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తుంది. ఆ క్రమంలో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలో రూ.కోటికి పైగా బీమా పరిహారం పక్కదారి పట్టినట్లు గుర్తించింది. ఆ విషయంపై ముంబయిలోని ఎల్ఐసీ ప్రధాన కార్యాలయం ఇచ్చిన సమాచారంతో అధికారులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ కేసు విచారణ క్రమంలోనే రైతు బంధు నిధులు రూ.కోటి పక్కదారి పట్టినట్లు వెలుగులోకి వచ్చింది. మొత్తం రూ.2 కోట్లు కొట్టేసిన ఈ వ్యవహారంలో అధికారి గోరేటి శ్రీశైలంతో పాటు ఓదెలా వీరస్వామిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# బీఆర్ఎస్‌కు తీగల కుటుంబం గుడ్‌బై

**- అక్కడ కుటుంబానికి తప్ప నాయకులకు ప్రాధాన్యత లేదు : మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి**

**- స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు ఇవ్వని బీఆర్ఎస్ : రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి**

**- ఈ నెల 27న కాంగ్రెస్‌లో చేరిక**



మీర్ పేట్: బీఆర్ఎస్ పార్టీలో కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులకు తప్ప ఇతర నాయకులకు ప్రాధాన్యత లేదని, స్థానిక సంస్థలకు నిధులు, అధికారాలు ఇవ్వకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలించిందని రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని టీకేఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పదేండ్ల క్రితం జిల్లా పరిషత్తు గ్రామపంచాయతీల్లో పుష్కలంగా నిధులు ఉండేవని, అభివృద్ధి పనులు జరిగేవని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ నిధులు కేటాయించకుండా అభివృద్ధి నిరోధకంగా పరిపాలన చేసిందని విమర్శించారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసి, జెడ్పీ చైర్‌పర్సన్ నిధులు లేక గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఎదురైందన్నారు. ఇది కేవలం ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే కాదని, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎమ్మెల్యేలకే ప్రాధాన్యతనిస్తూ పరిపాలన కొనసాగించారని తెలిపారు. అందుకే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైందని తెలిపారు. తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి అనేక పదవుల్లో ఎమ్మెల్యేగా, హైదరాబాద్ మేయర్‌గా, హుడా చైర్మెన్‌గా నిస్వార్ధంగా ప్రజలకు సేవ చేశానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పటి నుంచి తనకి ప్రాధాన్యత ఇవ్వకపోయినా పార్టీ కోసం పనిచేశానని చెప్పారు. ఇతర పార్టీల్లో గెలిచిన ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకొని మంత్రి పదవులు కట్టబెట్టి సొంత పార్టీ నాయకులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈనెల 27న చేవెళ్లలో జరగబోయే బహిరంగ సభలో తెలంగాణ పీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో, కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంకా గాంధీ సమక్షంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె పాండుగౌడ్, సిద్ధల బాలప్ప, బేర బాలకృష్ణ, ఆకుల అరవింద్ కుమార్, రాకేష్ రెడ్డి, చప్పిడి సంతోష్ రెడ్డి, నాగేందర్ గౌడ్, తదితర నాయకులు ఉన్నారు.

# మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం

**- ఘనంగా పంచముఖి మున్నూరు కాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం**

**- అందరం ఒకే చోట కలుసుకోవడం సంతోషంగా ఉంది**

**- అధ్యక్ష కార్యదర్శులు హరిదాసు సాయి రెడ్డి, కులచారి సంతోష్**




నిజామాబాద్ : కుల బంధువులందరూ ఆత్మీయ సమ్మేళనంలో ఒకే చోట కలుసుకోవడం సంతోషంగా ఉందని, అందరినీ కలుసుకోవడం ఎంతో అనుభూతిని కలిగిందని అన్నారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్ లో వంద ఫీట్ల రోడ్ లోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న పంచముఖి మున్నూరు కాపు సంఘం భవనంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవము, మున్నూరు కాపు కుల బంధువుల ఆత్మీయ సమ్మేళనము కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో 90 మంది సభ్యుల పరిచయ కార్యక్రమాన్ని అధ్యక్షులు, కార్యదర్శి కోశాధికారి, నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించి, ఇంటి పెద్ద యజమానికి కండువా కప్పి కుటుంబ సభ్యుల వివరాలు ఒకరికొకరు పంచుకున్నారు. ఓవర్ వెయిట్ క్యాటగిరి లో ఎస్ జీ ఎఫ్ తైక్వాండో లో స్టేట్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి కి ఎంపికైన వైసాక్షి సంతోష్ కుమార్తె అక్షర ను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గం అధ్యక్షులుగా హరిదాసు సాయి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కులచారి సంతోష్, కోశాధికారిగా యేల్మల శంకర్, గౌరవాధ్యక్షులుగా బొబ్బిలి కిషన్, బంటు గంగాధర్, ముఖ్య సలహాదారులుగా ఆకుల శ్రీశైలం,ఆమ లడ్డు శంకర్, పెద్ద కాపు లుగా హరిదాసు మారుతి, దారం పోతన్న, ఉపాధ్యక్షులుగా నాగుర్త ధర్మేందర్, వైశాక్షి సంతోష్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా కర్క రమేష్, ముకుందం శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా ముద్దం ఆంజనేయులు, నక్క రఘునందన్, సోమిరెడ్డి జగదీష్, సలహాదారులుగా కోళ్ల సురేందర్, పుప్పాల ప్రదీప్, పంతుల ముత్యం, కార్యవర్గ సభ్యులుగా తోట నరేష్, బొల్లం అంజి రెడ్డి, ఆకుల తిర్మల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు హరిదాసు సాయి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుల చారి సంతోష్, కోశాధికారి యేల్మల శంకర్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాల క్రితం సంఘాన్ని ప్రారంభించామని, ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి సంఘ భవనాన్ని నిర్మించుకున్నామని మొదట బాబన్న, సాయి రెడ్డి, రఘునందన్, మారుతి లతో కలిసి ప్రారంభమైన పంచముఖి మున్నూరు కాపు సంఘము 90 మంది సంఘ సభ్యులుగా చేరడం సంతోషంగా ఉందని అన్నారు. కుల బంధువులందరూ ఒక వేదిక మీద కలిసి భోజనం చేయాలంటే ఉద్దేశంతో, మంచి చెడ్డ పంచుకోవాలని ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి కుటుంబ సభ్యులతో హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై ప్రతి రెండేళ్లకోసారి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తామని అన్నారు. సంఘం అభివృద్ధి కోసం ఎల్లవేళలా పాటుపడతామని, సంఘ సభ్యులకు అందుబాటులో ఉండి సంఘాన్ని మరింత అభివృద్ధి అయ్యేలా మా వంతు తోడుపాటునందిస్తామన్నారు. అనంతరం సంఘ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సభ్యులు మాజీ తొలి మహిళ మేయర్ ఆకుల సుజాత, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మి, శ్రీనివాస్, మున్నూరు కాపు సంఘం సభ్యులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

# అన్నదాతలపై కాల్పులు అమానుషం

**- ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా..**

**- సీఎంగా మోడీ మాటలు.. పీఎంగా ఆచరించట్లే**

**- స్వామినాథన్ సిఫారసుల అమలుతోనే భారతరత్నకు సార్ధకత**

**- సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని**




ఖమ్మం: పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కల్పించాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న అన్నదాతలపై మోడీ ప్రభుత్వం కాల్పులు జరపడం అమానుషమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఎంఎస్‌పీపై ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రుల కమిటీ చైర్మెన్‌గా వ్యవహరించిన నాడు గుజరాత్ సీఎం నరేంద్ర మోడీ నేడు ప్రధానమంత్రిగా ఆ కమిటీ సూచనలను ఆచరణలో పెట్టడం లేదని విమర్శించారు. స్వామినాథన్ సిఫారసుల అమలుతోనే ఆయనకిచ్చిన భారతరత్నకు సార్ధకత చేకూరుతుందని.. స్వయంగా ఆయన కుమార్తె మధుర వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతుగా సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన స్థానిక మంచికంటి మీటింగ్ హాలులో ఆదివారం నిర్వహించిన సదస్సులో పోతినేని మాట్లాడారు. ధాన్యాలు, పప్పులు, నూనె గింజలు, వాణిజ్య తదితర 23 రకాల పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నా మోడీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నీతి ఆయోగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్న స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకుండా.. ఆయన మరణానంతరం భారతరత్న ఇవ్వడం అవార్డుకు సార్ధకత చేకూరినట్టు కాదని తెలిపారు. వాస్తవ ధరకు కౌలు, పెట్టుబడి, శ్రమ, ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు.. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని మొత్తం ఖర్చుపై 50 శాతం అదనంగా ఎంఎస్పీ నిర్ధారించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలనే ఆరు డిమాండ్ల సాధన కోసం రైతులు ఢిల్లీలో ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. భూసేకరణ చట్టం–2013ను సైతం మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ విలువైన పంట భూములను కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆరోపించారు. పెసా, 1/70 చట్టాలను కూడా తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. ఢిల్లీలో రైతుల ఆందోళనలకు మద్దతుగా నిర్వహించే ఉద్యమాలకు సంఘీభావం తెలపాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు,సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వర్లు,బుగ్గవీటి సరళ, బండి రమేష్, వై. విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాల విస్తరణకే యుద్ధాలు

**- శివాజీ భారతజాతికి సింబల్ : ఎస్వీకే వెబినార్‌లో ప్రొఫెసర్ రాం పునియాని**



హైదరాబాద్: రాజుల మధ్య జరిగిన యుద్ధాలు ఆయా రాజ్యాల విస్తరణ కోసం జరిగినవే తప్ప ఆ రాజుల వ్యక్తిగత మతాల విస్తరణకు జరిగినవి కావని ముంబై ఐఐటీ విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ రాం పునియాని తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ కుమార్ సమన్వయంతో "ఛత్రపతి శివాజీని ఎందుకు స్మరించుకోవాలి?" అనే అంశంపై ఆదివారం నిర్వహించిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం సంఘ్ పరివార్, ముస్లింలీగ్, హిందూ మహాసభ తదితర సంస్థలు వక్రీకరణలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మనుస్మృతిని తిరిగి అమల్లోకి తెచ్చి బ్రాహ్మణీయ ఆధిక్యతతో తమ పెత్తనం కొనసాగించేందుకు బీజేపీ పరమత ద్వేషం పెంచుతున్నదని విమర్శించారు. శాస్త్రీయత లేకుండా మూఢనమ్మకాలతో నిండిన సమాజాన్ని తయారు చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా ఛత్రపతి శివాజీతో పాటు అక్బర్, మహారాణా ప్రతాప్ తదితర రాజులకు వారి పేర్లను బట్టి ఆయా మతాలకు ఆ రాజులను చిహ్నాలుగా చూపిస్తున్నారని విమర్శించారు. అయితే ఆ రాజులు ఏ మతాలకు చెందిన వారైనా వారి సైన్యంలో హిందువులు, ముస్లింలు ఉన్నారని గుర్తుచేశారు. ఇలాంటి విషయాలను పక్కన పెట్టి ఘర్‌వాపసీ పేరుతో ఆర్ఎస్ఎస్ హింసను ప్రేరేపిస్తున్నదని విమర్శించారు. ముస్లింలుగా, క్రైస్తవులుగా హిందువులు మారడానికి సంఘ్ ప్రచారం చేస్తున్న రాజుల పాలన కారణం కాదనీ, హిందూమతంలో ఉన్న కులవ్యవస్థ, అంటరానితనమేనని స్పష్టం చేశారు. అరబ్ దేశాల నుంచి సుగంధ ద్రవ్యాల వ్యాపారం చేసుకునేందుకు కేరళ మల్ బార్ వచ్చిన వారితో మొదటిసారి అక్కడి హిందువులు ఇస్లాంను స్వీకరించారని తెలిపారు. అదే విధంగా మరి కొందరు హిందువులు క్రైస్తవంలోకి వెళ్లారని తెలిపారు. ఛత్రపతి శివాజీ గొప్ప విలువలతో కూడిన రాజు అని తెలిపారు. ఆ కాలంలో హిందూ జాతీయవాద భావనే లేదనీ, కేవలం నేటి పాలకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం నాటి రాజులకు ఈ భావనను అంటగడుతున్నారని కొట్టిపారేశారు. మత రాజకీయ జాఢ్యం పాకిస్తాన్, ఉత్తర భారతదేశంలో ఆందోళనకరస్థాయిలో పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, మహిళలు, పేద వర్గాల సంక్షేమం, మతాలకు అతీతంగా అందరినీ సమానంగా పాలించిన శివాజీని హిందూ జాతీయవాదిగా చిత్రీకరిస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. శివాజీ పాలనలో అనేక మంచి నిర్ణయాలను తీసుకున్నారని తెలిపారు. యుద్ధం జరుగుతన్న సమయంలో, సైన్యం ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్న సందర్భంలో అక్కడ పంట పొలాలకు నష్టం కలిగించవద్దని తన సైన్యాన్ని ఆదేశించారని చెప్పారు. గ్రామాల స్థాయిలో పంటలపై ఇష్టానుసారంగా వేసే పన్నుల విధానాన్ని రద్దు చేసి హేతుబద్ధీకరించిన రైతు శ్రేయోభిలాషి శివాజీ అని కొనియాడారు. యుద్ధం గెలిచిన సమయంలో ఇతర మతాలకు చెందిన మహిళలను బందీలుగా తీసుకొస్తే తన సైన్యాన్ని శిక్షించి ఆ మహిళలను తన తల్లులతో సమానమని చెప్పిన గొప్ప వ్యక్తి శివాజీ అని గుర్తుచేశారు.

# మీడియా అకాడమీ చైర్మెన్‌గా శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కే శ్రీనివాస్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎం. హనుమంతరావు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. రెండేండ్ల పాటు ఆయన పదవీలో కొనసాగుతారు. గతంలో విశాలాంధ్ర, మన తెలంగాణ పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. ప్రస్తుతం ప్రజాపక్షం ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

# దళితులకు 18 శాతానికి రిజర్వేషన్ పెంచాలి

**- తెలంగాణ దళిత పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గంధం సుమన్ కుమార్**



ముషీరాబాద్: రాష్ట్రంలో దళిత ప్రజలకు 18 శాతానికి రిజర్వేషన్ పెంచాలని తెలంగాణ దళిత పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గంధం సుమన్ కుమార్ డిమాండ్ చేశారు .తెలంగాణ దళిత పోరాట సమితి ఆధ్వర్యంలో దళిత ప్రజలకు 18 శాతం రిజర్వేషన్ పెంచాలని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతం పెంచాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీలో తీర్మానం చేయాలని, పార్లమెంటులో బిల్లును ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. విద్యా ఉద్యోగం సంక్షేమం ఉపాధి రాజకీయాల్లో రిజర్వేషన్ సవరించి పెరిగిన జనాభా కు ప్రకారం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. పారలమెంట్ ఎన్నికలకు ముందే అన్ని పార్టీలు వారి మ్యాని ఫెస్టోలలో రిజర్వేషన్ గురించి చేర్చాలని కోరారు. ఈ ధర్నా లో ప్రధాన కార్యదర్శి బండి అజరు, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు డబ్బా రాజు తదితరులు పాల్గొన్నారు.

# సైకాలజిస్ట్ కౌన్సిల్ వెంటనే ఏర్పాటు చేయాలి

**- తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్**

హిమాయత్‌నగర్: సైకాలజిస్ట్స్ కౌన్సిల్ ను వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎన్.సత్యనా రాయణరెడ్డి భవన్ లో గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల సైకాలజిస్ట్ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకాలజిస్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు అయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సైకాలజిస్టులు సంఘటితంగా పోరాటం చేస్తే ఇది అసాధ్య మేమి కాదన్నారు. ఇటీవల సూర్యాపేట జిల్లా ఇమాం పట్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరిగిన వరుస ఆత్మహత్యల నేపథ్యంలో విద్యార్థుల్లో ఆత్మన్యూనత భావాన్ని, పరీక్షల ఒత్తిడిని తగ్గించి వారిలో మానసిక ప్రశాంతతను అందించుటకు గాను సైకాలజిస్టుల అవసరం ఎంతైనా ఉందని, కావున వెంటనే సైకాలజిస్టుల నియామ కంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.ప్రతీ సైకాలజిస్ట్ నాయకత్వ లక్షణాలతో ఒక శక్తిగా ఎదగాలని ఇందుకు సంఘానికి దిన చర్యలో కొంత సమయాన్ని కేటాయించాలని కోరారు. ఇది మీ ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. సమజాంలో పెట్రేగిపోతున్న విపరీత ధోరణులపై వెంటనే ప్రతీ సైకాలజిస్ట్ స్పందించాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి శ్రీపూజ, కార్యదర్శి సుధాకర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా.శర్మిల కున్ను, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఆలీయా పర్వీన్, నాయకులు శ్రీదేవి, వైదేహి దలాల్, ఉమర్ ఖాన్, విజయరాణి, వైష్ణవి, డా.లావణ్య, అనితా పగిడిపాటి తదితరులు పాల్గొన్నారు.



# నేత చెబితేనే నిత్యావసరాలు



సూళ్లూరుపేట: వారందరూ మూడు రోజులపాటు నీటిలోనే ఉన్నారు.. ఇళ్ల ముందు సైతం మోకాటి లోతు వరకు నీరు చేరింది. ఇళ్లల్లో నుంచి బయటకు రాలేకపోయారు. ఆ సమయంలో వారిని ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడా పలకరించిన దాఖలాలు లేవు. ఆ తర్వాత కూడా వారు ప్రభుత్వ సాయానికి దూరమయ్యారు. నిత్యావసరాలకు అనర్హులయ్యారు. అదే పట్టణంలో భవంతుల్లో ఉండి.. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనని, అధికార పార్టీ నేతలు, వాలంటీరు సిఫార్సు ఉన్నవారందరూ అర్హులయ్యారు. ఇది మన పాలకుల లెక్క. దానినే అర్హత ప్రమాణంగా చూపుతూ స్థానిక అధికారులు నిత్యావసరాలు పంపిణీ చేశారు. జిల్లా ప్రజలను మిగ్‌జాం తుపాను నాలుగు రోజులపాటు గడగడలాడించింది. ఇది గూడూరు, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్లలోని తీర ప్రాంతంలో మరింతగా పంజా విసిరింది. ఆ ప్రాంత వాసులందరూ అతలాకుతలమయ్యారు. పూర్తిగా జనజీవనం స్తంభించింది. తీర ప్రాంతాల్లోని వారి ఇళ్ల చుట్టూ నీరు చేరింది. గత మంగళ, బుధవారాల్లో కొన్ని ప్రాంతాలు నీటిలోనే ఉన్నాయి. గురువారం నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. ఆ తర్వాత రోజు నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లోని వారిని ఇళ్లకు పంపుతూ రూ.వెయ్యి నుంచి రూ.2,500 చొప్పున ఆర్థికసాయం అందించారు. ఆ తర్వాత ఇళ్లలో నీరు చేరిన వారందరికీ నిత్యావసరాలు ఇవ్వాలని ప్రభుత్వం తలచింది. ఆ మేరకు 25 కిలోల బియ్యం, కిలో నూనె, కందిపప్పు పంపిణీ చేశారు. ఈ నిత్యావసరాల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. నిజమైన బాధితులను తప్పించారు. అనర్హులను సైతం బాధితులుగా చూపి, నిత్యావసరాలు అందించారు. పలుచోట్ల నేతల సిఫార్సు ఉన్న వారికి, వాలంటీర్ల పరపతి ఉన్నవారికి అందాయి. సూళ్లూరుపేటలోని కొన్ని ప్రాంతాల్లోకి కాళంగి వరద చేరింది. వరద ముంపు లేని ప్రాంతాల వారికి సైతం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇందులో పెద్ద భవంతుల్లోని వారూ ఉన్నారు. పురపాలిక పరిధిలో వట్రపాళెం, సాయినగర్, మహదేవయ్యనగర్, సూళ్లూరు, పరమేశ్వరినగర్, గణపతినగర్, బాపూజీ కాలనీలోకి వరద వచ్చింది. మొత్తం 11 వార్డు సచివాలయాల పరిధిలో 6,500 ఇళ్లలోకి నీరు చేరినట్లు దస్త్రాల్లో నమోదు చేసి నిత్యావసరాలు అందించారు. ఇందులో అధికారపార్టీ నేతల సిఫార్సుతోపాటు వాలంటీర్ల పలుకుబడితో అనర్హులు అందుకున్నారు.

# ప్రాణాలు పోతున్నా సూచికలేవీ?

పుత్తూరు : పుత్తూరు మండలంలోని తడుకు నుంచి పరమేశ్వరమంగళం వరకు గత రెండు నెలల్లో జరిగిన ప్రమాదాల్లో 15 మంది మృత్యువాత పడ్డారు. పలువురు క్షతగాత్రులయ్యారు. ఈ ప్రమా దాలు ఆయా కుటుంబాల్లో శోకం మిగుల్చు తున్నాయి. పుత్తూరు బైపాస్ రోడ్డులోని కొండల చెరువు, పిళ్లారిపట్టు క్రాస్ రోడ్డు వద్ద నిత్యం ప్రమా దాలు జరుగుతున్నాయి. మండలంలోని తొరూరుకు చెందిన మాజీ సర్పంచి కృష్ణయ్య గ్రామం నుంచి భార్య నందకుమారితో కలిసి పుత్తూరుకు వస్తుండగా కొండ చెరువు వద్ద వాహనం ఢీకొనడంతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. నిత్యం ఇలా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వీటి నివారణకు పోలీసు యంత్రాంగం గాని, జాతీయ రహదారుల అభివృద్ధి అధికారులు గానీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈనెల 2వ తేదీన పుత్తూరు పట్టణ సమీపంలోని ఈశలాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రాహ్మణతాంగాల్‌కు చెందిన గణపతి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. పెళ్లీడుకొచ్చిన కుమారుడు మృత్యువాత పడడంతో



ఆ కుటుంబం రోదనలు మిన్నంటాయి. తడుకు వద్ద జరిగిన ప్రమాదంలో ఓ రైల్వే గుత్తేదారుల వద్ద పని చేస్తున్న కూలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జమ్మలమడుగు నుంచి తమిళనాడులోని పళ్లిపట్టుకు సిమెంటు లోడు దించి వెనుదిరిగి వెళ్తూ కేవీం అగ్రహారం వద్ద లారీ నిలిపి దుకాణంలో సిగరెట్ తీసుకోవడానికి దిగిన లారీ డ్రైవర్ రౌతాయ్(44)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడ్డారు. కుటుంబసభ్యుల మృత్యువాతతో ఆ కుటుంబాలు కకావికలం అవుతున్నాయి

# సహకారానికి రెవెన్యూ గ్రహచారం



గూడూరు: సహకార పరపతి సంఘాల్లో రైతులకు రుణాలు దక్కడంలేదు. భూసర్వే చేపట్టిన గ్రామాల్లో రికార్డులు సొసైటీలకు అనుసంధానం కాక వన్‌బీలు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అటు పంట రుణాలతోపాటు వ్యక్తిగత రుణాలకు సహకార సంఘాలు దిక్కుగా మారిన పరిస్థితుల్లో ఆరు నెలలుగా సమస్య తలెత్తింది. దీనిని సరిచేయడానికి అటు ప్రభుత్వం.. ఇటు సహకార శాఖ కసరత్తు చేయకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. జిల్లాలో 32 వరకు సహకార బ్యాంకులున్నాయి. వీటి పరిధిలో ఏటా రూ.1,098.21 కోట్ల రుణాలు ఇస్తున్నారు. ఇందులో పంట రుణాలు రూ.183.41 కోట్ల మేర ఉంటున్నాయి. వీటిని ఏటికేడు రైతులు చెల్లించాల్సి ఉంది. ఇలా చెల్లించిన వారికి మాత్రమే సున్నా వడ్డీ పథకం అమలు చేస్తారు. రోజు గడిచినా ఏ రైతుకు వడ్డీ మాఫీ రావడంలేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతుండగా కొత్తగా రుణాలు తీసుకోవడానికి భూసర్వే పూర్తయిన గ్రామాల్లో వీలు లేకుండా పోయింది. తప్పని పరిస్థితుల్లో రైతులు ప్రైవేటు అప్పుల వైపు చూడాల్సి వస్తోంది. బ్యాంకులకు పరిధులు: బ్యాంకులు రుణాలు అందించడానికి పరిధులు ఏర్పాటు చేసుకున్నాయి. ఆరేడు గ్రామాలు కలిపి ఓ బ్యాంకు పరిధిలో దత్తతగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో సహకార బ్యాంకులు వాటి పరిధిలో ఇదే పద్ధతి అమలు చేస్తున్నాయి. దీంతో రైతులు వారి పరిధిలోని బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. తిరుపతి జిల్లాలోని 69 గ్రామాల్లో సర్వే పూర్తి చేయగా.. రెండో దశలో 208 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసి రికార్డులు అందిస్తున్నారు. ఆయా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు సచివాలయల ద్వారా ఇస్తున్నారు. ఇవి అందుకున్న రైతులు సొసైటీల వద్దకు తీసుకెళితే మీ రికార్డులు మా వద్ద చూడటానికి వీలు లేదని ఆన్‌లైన్ ద్వారా రుణాలు ఇవ్వడానికి వీలు కాదని ఖరాకండిగా చెప్పేస్తున్నారు. దీంతో రైతులు అటు బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏటా రూ.15.01 కోట్ల మేర రుణాలు రైతులకు అందజేస్తున్నారు. ఇందులో అగ్రభాగం పంట రుణాలు కాగా.. ఈ ఏడాది రికార్డులు సక్రమంగా లేని ఆరు గ్రామాల్లో పంట రుణాలు ఇవ్వడానికి వీలు లేని పరిస్థితి. కాగా ఇక్కడ రుణాలు తీసుకున్న రైతులు సున్నా వడ్డీ పథకానికి దూరం అవుతున్నారు.

# చేతికొచ్చిందేం లేదు.. చేయూత ఇవ్వండి

అనంతపురం:మా జీవితంలోనే ఇలాంటి దుర్భిక్ష పరిస్థితులు చూడలేదు. విత్తనం నాటిన నుంచి వర్షం జాడేలేదు. మొక్కల్లో పూత, కాయ కూడా రాకుండా పంటలు నిలువునా ఎండిపోయాయి. రైతాంగాన్ని బతికించండయ్యా అంటూ కేంద్ర కరవు బృందం ఎదుట రైతులు ఏకరవు పెట్టారు. అనంతపురం గ్రామీణం కందుకూరుకు చెందిన రైతు నారాయణప్ప ఎండిపోయిన కంది పంట పొలాన్ని సంయుక్త కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆధ్వర్యంలో కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్, ఇతర సభ్యులు పరిశీలించారు. పంట సాగుపై రైతులతో ఆరా తీశారు. ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టి, పూర్తిగా నష్టపోయామని నారాయణప్ప కరవు బృందం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడే రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఖరీఫ్‌లో ఐదెకరాల్లో రూ.1.08 లక్షలు పెట్టుబడి పెట్టి వేరుసెనగ సాగు చేస్తే రూ.20 వేలు చేతికొచ్చింది. రూ.88 వేలు నష్టపోయా. హెక్టారుకు రూ.17 వేలు పరిహారం ఇస్తామంటున్నారు. కనీసం పెట్టుబడి ఖర్చులన్నీ ప్రభుత్వం అందించి ఆదుకోవాలని చేతులెత్తి వేడుకున్నారు. చియ్యేడు రైతు త్రిలోక్‌నాయుడు మాట్లాడుతూ.. ‘పదెకరాల్లో కంది సాగు చేస్తున్నా. వర్షం లేక నష్టపోయా. ఎరువు, పురుగు మందులతో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. పండించిన పంటకు మార్కెటింగ్ సౌకర్యం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాలువ తవ్వారు. చెరువులకు నీరివ్వలేదు. గ్రామాల్లో తాగునీటికి కష్టంగా ఉంది. పశు గ్రాసం లేక పాల దిగుబడి తగ్గిపోయింది.చేస్తే రూ.20 వేలు చేతికొచ్చింది. రూ.88 వేలు నష్టపోయా. హెక్టారుకు రూ.17 వేలు పరిహారం ఇస్తామంటున్నారు. కనీసం పెట్టుబడి ఖర్చులన్నీ ప్రభుత్వం అందించి ఆదుకోవాలని చేతులెత్తి వేడుకున్నారు. చియ్యేడు రైతు త్రిలోక్‌నాయుడు మాట్లాడుతూ.. ‘పదెకరాల్లో కంది సాగు చేస్తున్నా. వర్షం లేక నష్టపోయా. పంట సాగుకు బంగారం బ్యాంకుల్లో తాకట్టు పెట్టా’ అంటూ వివరించారు. బృందం సభ్యులతో పాటు డీఏవో ఉ



మా మహేశ్వరమ్మ, డీడీహెచ్ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీడీ ఫిరోజ్, ఏడీఏ రవి, తహసీల్దారు విజయలక్ష్మి, ఏవో సాయిలక్ష్మి పాల్గొన్నారు.రెవెన్యూ భవన్‌లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చేస్తే రూ.20 వేలు చేతికొచ్చింది. రూ.88 వేలు నష్టపోయా. హెక్టారుకు రూ.17 వేలు పరిహారం ఇస్తామంటున్నారు. కనీసం పెట్టుబడి ఖర్చులన్నీ ప్రభుత్వం అందించి ఆదుకోవాలని చేతులెత్తి వేడుకున్నారు. చియ్యేడు రైతు త్రిలోక్‌నాయుడు మాట్లాడుతూ.. ‘పదెకరాల్లో కంది సాగు చేస్తున్నా. వర్షం లేక నష్టపోయా.ఈ సందర్భంగా సత్వరం రూ.329.82 కోట్లు కరవు సాయం అందించాలని కలెక్టర్ గౌతమి కోరారు. తొలుత శాఖల వారీగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఆ తర్వాత నష్టాలు, సాయంపై కంప్యూటర్ స్లైడ్స్ ద్వారా అధికారులు బృందానికి వివరించారు. 16 రకాల పంటలు సాగు చేశారని, మొత్తం 63 శాతం సాగు నమోదైందన్నారు. 2,35,408 రైతులకు సంబంధించి 2,12,025 హెక్టార్లలో పంటలు నష్టపోయారని తెలిపారు. ఒక్క వ్యవసాయ, ఉద్యానం కింద రూ.20.18 కోట్లు సాయం చేయాలని అభ్యర్థించారు. పశు సంవర్ధక శాఖకు రూ.1.74కోట్లు, గ్రామీణ నీటి సరఫరా కోసం రూ.7.04 కోట్లు, పట్టణ నీటికి రూ.2.72 కోట్లు, ఉపాధి పథకం కింద రూ.116.52 కోట్లు ఇవ్వాలని కోరారు.

# అద్దె భవనాలు.. అరకొర సౌకర్యాలు

పెద్దపల్లి: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లో కనీస వసతులు లోపించడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత పెరుగుతుండటంతో వణికిపోతున్నారు. నీటిని వేడి చేసే యంత్రాలు లేక విద్యార్థులకు చన్నీటి స్నానం తప్పడం లేదు. ఈ ఏడాదికి సంబంధించి దుప్పట్లు సరఫరా చేసినా ఇప్పటికీ పిల్లలకు చేరలేదు. దీంతో ఇంటి నుంచి తెచ్చుకున్న వాటితో కాలం వెళ్లదీస్తున్నారు. సొంత భవనాలు లేక అద్దె భవనాలే దిక్కయ్యాయి. జిల్లాలో 2 సమీకృత, 10 ప్రీమెట్రిక్, 6 పోస్టు మెట్రిక్ ఎస్సీ వసతిగృహాల్లో మొత్తం 1,432 మంది విద్యార్థులున్నారు. 6 ప్రీమెట్రిక్, 8 పోస్టు మెట్రిక్ బీసీ వసతిగృహాల్లో 1,203 మంది, 2 ఎస్టీ వసతి గృహాల్లో 100 మంది ఉన్నారు. 6 పోస్టు మెట్రిక్ ఎస్సీ వసతిగృహాలకు గాను 4 చోట్ల, 6 బీసీ వసతిగృహాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. గురుకులాల ఏర్పాటుతో ఏటికేడు విద్యార్థుల సంఖ్య తగ్గుతుండగా సమీకృత వసతిగృహాల్లో సమస్యలపై విద్యార్థులు ఆందోళన బాట పడుతున్నారు. ఈ ఏడాది మెస్‌ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు ఇప్పటివరకు అందలేదు. జిల్లాలోని పలు వసతిగృహాల్లో కిటికీలకు తలుపుల రక్షణ లేకపోవడంతో చలి కొరికేస్తోంది. మరోవైపు దోమలు దాడి చేస్తున్నాయి. మూత్రశాలలు లేవు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయి. ప్రహరీ సక్రమంగా లేకపోవడంతో పిల్లలకు రక్షణ కరవైంది. ఎస్సీ వసతిగృహాలకు నాసిరకమైన మంచాలు, పరుపులు పంపిణీ చేయడంతో దెబ్బతింటున్నాయి. బీసీ వసతిగృహాలకు మంచాలు అందక నేలపైనే పడుకుంటున్నారు. మంథని సమీకృత బాలుర వసతిగృహంలో 105 మంది విద్యార్థులుంటున్నారు. సొంత భవనమే అయినా పూర్తి స్థాయిలో వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులుండే పైన గదుల్లో మరుగుదొడ్లను కొద్ది నెలలుగా శుభ్రపరచడం లేదు. తలుపుల కింది భాగంలో రంధ్రాలు పడ్డాయి. విద్యార్థుల గదుల్లో నాలుగు లైట్లకు ఒక్కోటి



మాత్రమే ఉన్నాయి. పంకాలు సరిగ్గా పని చేయడం లేదు. విద్యుత్తు బోర్డులు పగిలిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. వసతిగృహం బయట నిల్వ చేసిన చెత్తను 15 రోజులుగా మున్సిపాలిటీ సిబ్బంది తీసుకెళ్లడం లేదు. భోజనం సరిగ్గా వడ్డించడం లేదంటూ గత ఆగస్టు 15న విద్యార్థులు పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద ధర్నా చేయగా అప్పటి నుంచి మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారు. అప్పట్లో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు సంరక్షకులను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత గోదావరిఖని, కమాన్‌పూర్ వసతిగృహాల వార్డెన్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వారు చుట్టపు చూపుగా వస్తుండటంతో పారిశుధ్యంపై పర్యవేక్షణ కరవైంది. ధర్మారంలోని బీసీ బాలుర వసతిగృహంలో ధర్మారంతో పాటు పాలకుర్తి, గొల్లపల్లి మండలాలతో పాటు 80 మంది విద్యార్థులుంటున్నారు. రెండేళ్ల కిందటి వరకు స్థానిక ఎస్సారెస్పీ స్థలంలోని రేకులషెడ్లలో వసతిగృహాన్ని నిర్వహించారు. ఇబ్బందులు ఎదురవుతుండటంతో ప్రధాన రహదారి పక్కన అద్దె భవనంలోని ఒకటో అంతస్థులోకి తరలించారు. దుప్పట్లు, కార్పెట్లు అందించారు. అయిదేసి మరుగుదొడ్లు, స్నానాల గదులున్నాయి. అద్దె భవనం కావడంతో ఆట స్థలం లేదు.

# ప్రయాణికులు పెరిగి.. ఆదాయం తగ్గి..



కరీంనగర్ : తెలంగాణ సర్కార్ మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సు (ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు)ల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణం చేయడానికి అవకాశం ఇచ్చింది. ఈ నెల 9 నుంచి అమల్లోకి వచ్చిన ఈ విధానంతో బస్సుల్లో మహిళల సంఖ్య పెరగగా, రెగ్యులర్ ఆదాయం మాత్రం తగ్గింది. కరీంనగర్ రీజియన్‌లో ఈనెల 10, 11 తేదీల్లో ఆర్టీసీ బస్సులు 7 లక్షల కిలోమీటర్లు తిరగగా 7.93 లక్షల ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరారు. రూ.2.16 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ప్రతి సోమవారం సాధారణంగా 3 లక్షలకు పైగా బస్సుల్లో ప్రయాణిస్తుండగా రూ.2 కోట్లకు పైగా ఆదాయం సమకూరేది. కానీ అతివలకు ఉచిత ప్రయాణం కల్పించిన తర్వాత ఈ సోమవారం ప్రయాణికుల సంఖ్య పెరిగి.. ఆదాయం తగ్గింది. సాధారణ రోజుల్లో కూడా 2.50 లక్షల మంది బస్సుల్లో వెళ్తుండగా రూ.1.50 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. ప్రయాణికులు పెరుగుతున్నా సంస్థకు నిత్యం నగదు రూపంలో వచ్చే ఆదాయం మాత్రం రూ.60 లక్షల వరకు తగ్గుతుందని అధికారులు అంటున్నారు. మహాలక్ష్మి పథకం అందుబాటులోకి మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు సామర్థ్యానికి మించి వెళ్తున్నాయి. ప్లాట్‌ఫాంపై పది నిమిషాలు కూడా నిలవడం లేదు. పల్లెవెలుగుల్లోనూ అధికంగానే ఉంటున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచితే మరింత మెరుగైన సేవలతోపాటు సర్కార్ ఆశయం నెరవేరుతుందని ప్రయాణికులు అంటున్నారు. కరీంనగర్ రీజియన్‌కు మరో వంద బస్సులు అదనంగా ఇవ్వాలని స్థానిక అధికారులు ఉన్నతాధికారులను అడిగినట్లు సమాచారం. పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. వారు ఇబ్బందులు పడకుండా చూస్తున్నాం. అందరి సహకారంతో రానున్న రోజుల్లో ఇదే ఒరవడిని కొనసాగిస్తాం.

# సర్కారు బడులకు సౌర వెలుగులు

మెట్‌పల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు విద్యాశాఖ సంకల్పించింది. నాబార్డుకు చెందిన గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులతో సౌర యూనిట్లు ఏర్పాటు చేయాలని పునరుత్పాదక ఇంధన సంస్థ(టీఎస్ రెడ్కో)కు బాధ్యతలు అప్పగించింది. ఇందుకోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 646 పాఠశాలలను ఎంపిక చేశారు. సౌర విద్యుత్తు యూనిట్లు ఏర్పాటైతే పాఠశాలల్లో విద్యుత్తు బిల్లుల సమస్య తీరనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యుత్తు ఛార్జీల భారం తప్పడం లేదు. ప్రభుత్వం పాఠశాలలకు మంజూరు చేసిన నిధుల్లో ఎక్కువ శాతం బిల్లుల చెల్లింపునకు వెచ్చిస్తున్నారన్న వాదనలున్నాయి. పైగా తరగతి గదుల్లో మన ఊరు–మన బడిలో భాగంగా బల్బులు, పంకాలు బిగించారు. అంతేకాకుండా డిజిటల్ విద్యలో భాగంగా కంప్యూటర్లు, ఇంటరాక్టివల్ ప్యానళ్లను సైతం అమర్చారు. పాఠశాల నీటి అవసరాలకు బోరు మోటారుకు విద్యుత్తు అవసరం ఉంటుంది. దీంతో నెలనెలా వచ్చే విద్యుత్తు బిల్లులు కట్టలేక, సకాలంలో గ్రాంటు విడుదల కాక బకాయిలు పేరుకుపోతున్నాయి. బిల్లుల భారం తగ్గించాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయంగా పాఠశాలల్లో సౌర విద్యుత్తును అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు అదర్శ, కస్తూర్బా, గురుకుల పాఠశాలల్లో సౌర విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విద్యార్థుల సంఖ్య, పాఠశాల అవసరాలను బట్టి కనిష్ఠంగా 2 కిలోవాట్ నుంచి గరిష్ఠంగా పది కిలో వాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఇందుకోసం ఒక కిలోవాట్‌కు రూ.లక్ష చొప్పున గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులను



వెచ్చించనున్నారు. అయిదేళ్ల నిర్వహణతో పునరుత్పాదక ఇంధన సంస్థ టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 2 కిలోవాట్లు, ఉన్నత పాఠశాలల్లో 5 కిలోవాట్లు, ఆదర్శ, కస్తూర్బా, గురుకుల పాఠశాలల్లో 10 కిలోవాట్ల సామర్థ్యం గల యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయించారు. ఆదర్శ, కస్తూర్బా, గురుకుల పాఠశాలల్లో వసతి గృహాలు ఉండటం వల్ల విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుంది. వీటిని పరిశీలించి అక్కడ ఎక్కువ సామర్థ్యం చేయనున్నారు. పాఠశాలల అవసరాలను బట్టి విద్యుత్తును వినియోగిస్తున్నారు. కొన్ని చోట్ల నెలనెలా బిల్లులు చెల్లించేందుకు గ్రాంటు లేక బకాయిలు పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుతో ఉపశమనం లభించనుంది. వీటి ఏర్పాటుతో విద్యుత్తు వినియోగానికి ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేకుండా పాఠశాలకు సరిపడా విద్యుత్తు వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. సౌర యూనిట్ల ఏర్పాటుతో పాఠశాలలకు విద్యుత్తు బిల్లుల సమస్య ఉండదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# వెన్ను విరిచిన మిగ్‌జాం- పంటలకు అపార నష్టం




చిత్తూరు :ఎంతో వ్యయప్రయాసలతో సాగు చేసిన పంటలు వర్షాలతో దెబ్బతిన్నాయి. ప్రధానంగా జిల్లాలోని నగరి డివిజన్‌లో వరి, వేరుసెనగ, ఉద్ది పంటల సాగు చేపట్టారు.నష్టపోయిన విస్తీర్ణంలో 234 హెక్టార్లకే రాయితీ విత్తనం పంపిణీకి వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపింది. వేరుసెనగ విత్తు 100 క్వింటాళ్లు, ఉద్దు విత్తు 3 క్వింటాళ్లు, నువ్వులు 9.5 క్వింటాళ్ల పంపిణీకి వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఎకరాకు రూ.20–30 వేలు పెట్టుబడి వెచ్చించారు. అన్ని పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎంతో శ్రమ పెట్టారు. ఎన్నో ఆశలతో సాగు చేస్తే వర్షార్పణం కావడంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 24 మండలాల్లో 137 గ్రామాల పరిధిలో 857 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. 1613 మంది రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అత్యధికంగా నింద్ర, విజయపురం, నగరి మండలాల్లో నష్టం వాటిల్లింది. వరి రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లింది. వర్షానికి పంట నష్టపోయిన విస్తీర్ణంలో 234 హెక్టార్లకే రాయితీ విత్తనం పంపిణీకి వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపింది. వేరుసెనగ విత్తు 100 క్వింటాళ్లు, ఉద్దు విత్తు 3 క్వింటాళ్లు, నువ్వులు 9.5 క్వింటాళ్ల పంపిణీకి వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే బాధిత రైతులకు రాయితీ విత్తనాలు అందజేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.ఖరీఫ్‌లో సాగై దెబ్బతిన్న పంటల బాధిత రైతులకు రాయితీ విత్తు పంపిణీ లేనట్లే. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందజేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. కేవలం రబీలో సాగు చేపట్టి నష్టపోయిన రైతులకే రాయితీ విత్తు పంపిణీ చేయనున్నారు. రబీ సీజన్ వరి పంట దెబ్బతిన్న బాధితులకు వారి అభీష్టం మేరకు రాయితీ విత్తు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

## చీరకట్టులో చక్కనమ్మ..
## అనన్య ఎంత ముద్దుగుందో..



మల్లేశంతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ అనన్య నాగళ్ళ. ప్రియదర్శి హీరోగా నటించిన ఈలో తన నటనతో ఆకట్టుకుంది అనన్య . ఆతర్వాత ఈ చిన్నది ఒకటి రెండు ల్లో నటించింది కానీ అంతగా గుర్తింపు రాలేదు. ఆతర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లో నటించింది అనన్య.మల్లేశం తో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ అనన్య నాగళ్ళ. ప్రియదర్శి హీరోగా నటించిన ఈ లో తన నటనతో ఆకట్టుకుంది అనన్య . ఆతర్వాత ఈ చిన్నది ఒకటి రెండు ల్లో నటించింది కానీ అంతగా గుర్తింపు రాలేదు. ఆతర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లో నటించింది అనన్య. పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన వకీల్ సాబ్ లో కీలక పాత్రలో నటించి మెప్పించింది అనన్య. పెద్దగా డైలాగ్స్ లేకపోయినా తన ఎక్స్ ప్రెషన్స్ తో ఆకట్టుకుంది. వకీల్ సాబ్ తర్వాత అనన్యకు బ్యాక్ టు బ్యాక్ ఆఫర్స్ వస్తాయని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. ఈ అమ్మడు ఆతర్వాత పెద్ద ల్లో ఛాన్స్ లు అందుకోలేకపోయింది.ఇటీవలే ఓ తో ప్రేక్షకు ల ముందుకు వచ్చింది. ఇక సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటూ తన ఫొటోలతో అభిమానులను కవ్విస్తూ ఉంటుంది. తాజాగా ఈ చిన్నది చీర కట్టులో కొన్ని ఫోటోలను పంచుకుంది.

## నేను అలా కాదు అంటున్న
## మృణాళ్ ఠాకూర్..



ఈ రోజుల్లో ఒక్క హిట్ రాగానే పొలోమని 10 లు ఒప్పుకుంటున్నారు హీరోయిన్లు. కానీ మృణాళ్ ఠాకూర్ మాత్రం విభిన్నంగా కనిపిస్తున్నారు. పైగా కారెక్టర్ కొత్తగా ఉందని ట్రై చేసా..కానీ లోపల ఒరిజినల్ అలాగే ఉంది.. అది బయటికొస్తే రచ్చే అంటున్నారు ఈ బ్యూటీ. ఇండస్ట్రీ ఇంత వేగంగా ముందుకు పోతుంటే.. మృణాళ్ మాత్రమే ఎందుకు నిదానమే ప్రధానం అంటున్నారు..? ఇదే మృణాళ్ ఒరిజినల్ వర్షన్.. గ్లామర్ షో చేయడం మొదలుపెడితే హద్దులే లేకుండా రెచ్చిపోవడం ఈమె స్టైల్.ఈ రోజుల్లో ఒక్క హిట్ రాగానే పొలోమని 10 లు ఒప్పుకుంటున్నారు హీరోయిన్లు. కానీ మృణాళ్ ఠాకూర్ మాత్రం విభిన్నంగా కనిపిస్తున్నారు. పైగా కారెక్టర్ కొత్తగా ఉందని ట్రై చేసా.. కానీ లోపల ఒరిజినల్ అలాగే ఉంది.. అది బయటికొస్తే రచ్చే అంటున్నారు ఈ బ్యూటీ. ఇండస్ట్రీ ఇంత వేగంగా ముందుకు పోతుంటే.. మృణాళ్ మాత్రమే ఎందుకు నిదానమే ప్రధానం అంటున్నారు..? ఇదే మృణాళ్ ఒరిజినల్ వర్షన్.. గ్లామర్ షో చేయడం మొదలుపెడితే హద్దులే లేకుండా రెచ్చిపోవడం ఈమె స్టైల్.

## పవన్ కళ్యాణ్ సినిమాకు బ్రేక్.. రవితేజతో
## మూవీ కమిట్ అయిన హరీశ్ శంకర్



పవన్ కళ్యాణ్‌తో సినిమాలు ఫిక్స్ అయిన రోజే తెలుసు.. అవి అనుకున్న టైమ్‌లో పూర్తికావని! కొన్ని రోజులు రాజకీయాలు.. కాకపోతే ఆ సమయంలో ఆయన ఇచ్చిన కాన్ఫిడెన్స్ చూసి కచ్చితంగా అనుకున్న సమయానికే సినిమాలు పూర్తి చేస్తాడేమో అని అనుకున్నారు. అయితే తెలంగాణ ఎన్నికల సందర్భంగా నెలరోజులు లీవ్ తీసుకున్న పవన్ కళ్యాణ్.. ఇప్పుడు ఏపీ ఎన్నికల కోసం ఏకంగా కష్టమే అని తేలడంతో ఇతర సినిమాలతో బిజీ అయిపోతున్నారుకేవలం పూర్తిగా మారుస్తుంటాడు ఈయన. గతంలో గబ్బర్ సింగ్, గద్దలకొండ గణేష్ లాంటి సినిమాలు అలాగే తెరకెక్కించాడు హరీశ్ శంకర్. ఇప్పుడు పవన్ కళ్యాణ్‌తో చేస్తున్న ఉస్తాద్ కూడా తేరీ సినిమా రీమేక్. అలాగే రవితేజ సినిమాను కూడా ఇక్కడి ఆడియన్స్ అభిరుచికి తగ్గట్టు తెరకెక్కించాలని చూస్తున్నాడు హరీశ్ శంకర్.

## చంపేస్తామని పూజా హెగ్డే?కు బెదిరింపులు..
# అక్కడ జరిగిన గొడవే కారణమా ?..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే చాలా రోజులుగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. చివరిసారిగా కిసీ కా భాయ్ కిసీ కా జాన్ చిత్రంలో కనిపించింది. ఆ తర్వాత మరో ప్రాజెక్ట్ చేయలేదు. తాజాగా ఈ బ్యూటీకి సంబంధించిన ఓ షాకింగ్ విషయం సోషల్ మీడియాలో హల్చల్ చేస్తుంది. లేటెస్ట్ గా వినిపిస్తోన్న టాక్ ప్రకారం పూజా హెగ్డేకు చంపేస్తామని బెదిరింపులు వచ్చాయట. ఈ విషయాన్ని పాపులర్ సెలబ్రెటీ ఫోటోగ్రాఫర్ వైరల్ భయాని ఇన్ స్టా ఖాతాలో షేర్ చేశాడు. ఇటీవల దుబాయ్?లో జరిగిన గొడవ తర్వాత పూజాగా చంపేస్తామని బెదిరించారట. దీంతో పూజా అక్కడి నుంచి వెంటనే భారతదేశానికి తిరిగి వచ్చిందంటూ రాసుకొచ్చాడు. దీంతో పూజా అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. పూజాకు ఇది అస్సలు మంచిది కాదు.. మీరు క్షేమంగా భారత్ చేరుకోండి అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేశారు. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు పూజా నుంచి ఎలాంటి క్లారిటీ రాలేదు.అయితే ఈ రూమర్స్ పై పూజా హెగ్డే టీమ్ స్పందించింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతున్న వార్తలలో ఎలాంటి నిజం లేదని పూజా టీం సభ్యుడు ఫ్రీ ఫెస్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 'ఇది పూర్తిగా అవాస్తవం. ఇలాంటి నకిలీ వార్తలను ఎవరు ప్రారంభించారో మాకు తెలియదు. ' అంటూ చెప్పుకొచ్చాడు. అయితే ఈ విషయంపై మాత్రం పూజా స్పందంచలేదు.

అటు వైరల్ భయానీ సైతం పూజా హెగ్డేకు చంపేస్తామని బెదిరింపులు అని పోస్ట్ చేసిన కాసేపటికే డెలిట్ చేశారు. పూజా చివరగా సల్మాన్ ఖాన్ నటించిన కిసీ కా భాయ్ కిసీ కి జాన్ లో కనిపించింది. ఈ మూవీ ఏప్రిల్ లో విడుదలై పర్వాలేదనిపించుకుంది. ప్రస్తుతం పూజా బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్ నటిస్తోన్న దేవా చిత్రంలో నటిస్తుంది. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రాబోతున్న ఈ కు రోషన్ ఆండ్రూస్ దర్శకత్వం వహిస్తుండగా.. సిద్ధార్థ్ రాయ్ కపూర్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నారు. ఈ వచ్చే ఏడాది అక్టోబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. అంతేకాకుండా హిందీలో హౌస్ ఫుల్ 5లోనూ నటిస్తుంది. ఇందులో అక్షయ్ కుమార్, రితీష్ దేశ్‌ముఖ్, జాన్ అబ్రహం, అభిషేక్ బచ్చన్, బాబీ డియోల్, కృతి సనన్, కృతి కర్బందా, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, దిశా పటానీ , చుంకీ పాండే కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## బాక్సాఫీస్ వద్ద యానిమల్ విధ్వంసం.. సెకండ్ పార్ట్‌లో
# హీరోయిన్‌గా జాక్‌పాట్ కొట్టేసిన హీరోయిన్..



డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన యానిమల్ చిత్రం భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద ఈ మూవీ సెన్సెషన్ క్రియేట్ చేస్తుంది. డిసెంబర్ 1న విడుదలైన ఈ చిత్రం ఇప్పటివరకు దాదాపు రూ.800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇందులో రణబీర్ కపూర్, అనీల్ కపూర్, రష్మిక మందన్నా, త్రిప్తి డిమ్రి, బాబీ డియోల్ ప్రధాన పాత్రలు పోషించారు. తండ్రికొడుకుల అనుబంధం నేపథ్యంలో వచ్చిన ఈ మూవీ విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అయితే భారీ వసూళ్లతో దూసుకుపోతున్న ఈ కు సెకండ్ పార్ట్ రాబోతుందని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రకటించారు. అంతే కాకుండా యానిమల్ రెండో భాగం పేరు యానిమల్ పార్క్ అని తెలిపారు. హిందీలో చిత్రీకరించిన ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం భాషల్లోనూ రిలీజ్ చేయగా.. పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్ టాక్ తో దూసుకుపోతుంది. ఈ కు సౌత్, నార్త్ అడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. ముఖ్యంగా ఇంతకు మునుపెన్నడూ చూడని పాత్రలో రణబీర్ అద్భుతమైన నటన కనబరిచాడని పొగడ్తలు కురిపిస్తున్నారు. డిసెంబర్ 1న విడుదలైన యానిమల్ ఇప్పటివరకు దాదాపు రూ.800 కోట్లు వసూలు చేసింది. భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన పదో చిత్రం ఇదే కావడం విశేషం. యానిమల్ సక్సెస్ ఫుల్ గా దూసుకుపోతుండడంతో ఇప్పుడు ఈ సెకండ్ పార్ట్ పై ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ వినిపిస్తున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో సెకండ్ పార్ట్ హీరోయిన్ గురించి ఆసక్తికర విషయం చక్కర్లు కొడుతుంది. తాజాగా వినిపిస్తోన్న సమాధానం ప్రకారం.. రెండో భాగంలో హీరోయిన్?గా మలయాళీ బ్యూటీ మాళవిక మోహన్ ఎంపికైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో స్టార్ డమ్ ప్రయత్నాలు చేస్తుంది ఈ బ్యూటీ.

## 'బిగ్‌బాస్' ఫైనల్‌కు గెస్టులుగా
# రానున్న టాలీవుడ్ స్టార్ హీరోలు.?



గత రెండు సీజన్‌లలో ప్రేక్షకులను పెద్దగా అలరించలేక పోయిన బిగ్ బాస్ ఈసారి మాత్రం టీఆర్పీ రేటింగ్‌తో దూసుకుపోతుంది.ఇక ఈ వారంతో బిగ్ బాస్ సీజన్ 7 ముగుస్తుందన్న విషయం తెలిసిందే. అయితే ఈ బిగ్ బాస్ గ్రాండ్ ఫినాలేకు ఇద్దరు టాలీవుడ్ స్టార్ హీరోలు వస్తున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి.ఒకరు ఈ ఏడాది 'భగవంత్ కేసరి'తో బ్లాక్ బస్టర్ అందుకున్న నందమూరి బాలకృష్ణ కాగా.. ఇంకొకరు సూపర్ స్టార్ మహేష్ బాబు. శని, ఆది వారాల్లో జరిగే ఒక ఎపిసోడ్‌కు వీరిద్దరూ రాబోతున్నట్లు సమాచారం. అయితే దీనిపై బిగ్ బాస్ నిర్వహకులు ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.ఇక ఈ వారం ఏడో సీజన్‌కు ఎండ్ కార్డు పడనుంది. ఆదివారం విన్నర్ ఎవరో.. రన్నర్ ఎవరో ప్రక టించే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇన్ సైడ్ టాక్ ప్రకారం ఏడో సీజన్ విన్నర్ పల్లవి ప్రశాంత్ అవుతాడని.. రన్నర్‌గా శివాజీ నిలుస్తాడని అంటున్నారు. ఇందులో నిజమెంటో తెలియాలంటే ఆదివారం వరకు వేచి చూడాల్సిందే.

## అల్లు అర్జున్ కాదు..
# ఆ హీరోను లాక్ చేస్తున్న త్రివిక్రమ్..



త్రివిక్రమ్.. ఓన్లీ ఫర్ ఫ్యూ హీరోస్ అనే బోర్డ్ ఉంటుంది టాలీవుడ్‌లో ఎప్పుడూ. తన సేఫ్ జోన్ అనుకుంటాడో ఏమో కానీ అందులోంచి బయటికి రావడానికి అంతగా ఇష్టపడడు గురూజీ.తన కోసం చాలా మంది హీరోలు వేచి చూస్తున్నా కూడా మాటల మాంత్రికుడు మాత్రం తన మాయ కేవలం కొందరు హీరోలతోనే చేస్తుంటాడు. దర్శకుడిగా మారి 20 ఏళ్లవుతున్నా.. ఈయన పని చేసిన హీరోలు అరడజన్ కూడా దాటలేదు. ఒక్కో హీరోతోనే మూడు నాలుగు సినిమాలు చేస్తుంటాడు. తాజాగా మరోసారి అదే చేస్తున్నాడు ఈయన. ఇప్పుడు మహేశ్ బాబుతో పని చేస్తున్నాడు. ఈ కాంబినేషన్‌లో మూడో సినిమా ఇది. దీనికంటే ముందు అల్లు అర్జున్, పవన్ కళ్యాణ్‌తోనూ మూడు సినిమాలు చేశాడు త్రివిక్రమ్. ఎన్టీఆర్, నితిన్, తరుణ్‌తో ఒక్కో సినిమా చేశాడు. ఇదిలా ఉ ంటే తాజాగా మరోసారి హీరోలను రిపీట్ చేస్తున్నాడు గురూజీ. గుంటూరు కారం తర్వాత ఆల్రెడీ అల్లు అర్జున్‌తో సినిమాను ప్రకటించాడు కూడా. ఈ సారి పాన్ ఇండియన్ రేంజ్‌లో భారీగానే ఈ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాడు. పైగా అది మైథాలజీ అనే టాక్ కూడా వినిపిస్తుంది.ఇదిలా ఉంటే అల వైకుంఠపురములో లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత మరోసారి భారీ గ్యాప్ తీసుకున్నాడు ఈయన. ఇప్పటికే ఈ చిత్రం వచ్చి మూడేళ్లు దాటిపోయింది. 2024 సంక్రాంతికి గుంటూరు కారం వస్తుంది. అంటే నాలుగేళ్ళ గ్యాప్ అన్నమాట. ఇదిలా ఉంటే గుంటూరు కారం తర్వాత బన్నీతోనే సినిమా అనుకున్నా.. ఇప్పుడు అది మారేలా కనిపిస్తుంది. నిజానికి గుంటూరు కారం 2023లోనే రావాల్సిన సినిమా. కాకపోతే కర్ణుడి చావుకు లక్ష కారణాలన్నట్టు.. ఈ సినిమా మొదలు పెట్టిన తర్వాత చాలా జరిగాయి. ముందు ఎన్టీఆర్‌తో అనుకున్న సినిమా కాస్తా ఆగిపోవడం.. ఆ తర్వాత అనుకోకుండా మహేశ్ సినిమా వర్కవుట్ అవ్వడం.. షూటింగ్ మొదలైన తర్వాత మహేశ్ బాబు అమ్మా నాన్నలు చనిపోవడంతో గుంటూరు కారం ఆలస్యం అవుతూనే వచ్చింది. చివరికి ఎలాగోలా చివరి మూడు నెలల నుంచి నాన్ స్టాప్ షూటింగ్‌తో చివరి దశకు తీసుకొచ్చాడు గురూజీ. మరో నెల రోజుల్లో మాస్ యాక్షన్ చూడబోతున్నాం. దీని తర్వాత అల్లు అర్జున్ సినిమా కోసం రెడీ అవుతున్నారు ఫ్యాన్స్ కూడా. కానీ ప్రస్తుతం పుష్ప 2తో బిజీగా ఉన్న బన్నీ.. మరో 8 నెలలు దానికే టైమ్ ఇవ్వను న్నాడు.ఆగస్ట్ 15న ఈ చిత్రం విడుదల కానుంది. అంటే బన్నీ కోసం త్రివిక్రమ్ కనీసం ఆర్నెళ్లకు పైగానే వేచి చూడాల్సి వస్తుంది.

## మతిపోగొడుతున్న
## పూనమ్ బజ్వా



పూనమ్ బజ్వా.. ఈ బ్యూటీ చేసింది తక్కువ లే అయినా.. మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. తన అందాలతో ప్రేక్షకులను కవ్వించింది ఈ వయ్యారి. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్రాలలో నటించి ప్రేక్షకులను అలరించింది పూనమ్ బజ్వా. తెలుగులో 2005లో వచ్చిన మొదటి అనే మూవీతో ప్రేక్షకులను పలకరించింది. పూనమ్ బజ్వా.. ఈ బ్యూటీ చేసింది తక్కువ లే అయినా.. మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. తన అందాలతో ప్రేక్షకులను కవ్వించింది ఈ వయ్యారి. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్రాలలో నటించి ప్రేక్షకులను అలరించింది పూనమ్ బజ్వా. తెలుగులో 2005లో వచ్చిన మొదటి అనే మూవీతో ప్రేక్షకులను పలకరించింది. ప్రేమంటే ఇంతే లో నటించి మెప్పించింది.

## 'బలగం' వేణు దర్శకత్వంలో
## నాని కొత్త సినిమా?



టాలివుడ్ స్టార్ హీరో న్యాచురల్ స్టార్ నాని వరుస హిట్ సినిమాల లో నటిస్తున్నాడు..ఇటీవల ఆయన నటించిన సినిమాలు అన్ని కూడా మంచి హిట్ టాక్ ను అందుకున్నాయి ఈ ఏడాది ఇప్పటికే 'దసరా' సినిమాతోబ్లాక్ బస్టర్‌ని అందుకున్నారు.ఇప్పుడు ఇయర్ ఎండ్‌ని కూడా అంటే గ్రాండ్‌గా ముగించడం కోసం 'హాయ్ నాన్న'ని తీసుకు వస్తున్నా రు.. ఈ సినిమా కొద్ది రోజుల్లో విడుదల కాబోతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు..ఈ క్రమంలోనే తాజాగా ఎక్స్ ద్వారా అభిమాను లతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ ఇంటరాక్షన్ లో ఫ్యాన్స్ అడిగిన ప్రశ్నలకు నాని సమాధానం ఇస్తూ వచ్చారు. ఇందులో భాగంగా ఒక అభిమాని..'కొత్త దర్శకుల్లో మీరు ఎవరితో కలిసి వర్క్ చేయా లని అనుకుంటున్నారు' అని ప్రశ్నించాడు. దానికి నాని బదులిస్తూ.. 'బలగం వేణు' అని బదులిచ్చారు.. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట తెగ వైరల్ అవుతుంది..జబర్దస్త్ ద్వారా ఫేమ్ ని సంపాదించుకొని బలగంతో దర్శకుడిగా మారిన వేణు.. మొదటి సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్ని నమోదు చేశారు.

## సమకాలీన సమస్యలే
## ఇతివృత్తంగా 'దళారి'



రాజీవ్ కనకాల, షకలక శంకర్, శ్రీతేజ్, ఆక్సాఖాన్, రూపిక ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'దళారి'. కాచిడి గోపాల్‌రెడ్డి దర్శకుడు. ఎదవెల్లి వెంకట్‌రెడ్డి నిర్మాత. ఈ నెల 15న సినిమా విడుదలకానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమవేశం ఏర్పాటు చేశారు. 'వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి జీవితాన్ని ప్రేరణగా తీసుకొని తయారు చేసుకున్న కథ ఇది. సమకాలీన సమస్యల నేపథ్యంలో సినిమా ఉ ంటుంది. ' అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు మంచి టీమ్ కుదిరిందని, మంచి సినిమా తీశామనే తృప్తితో ఉన్నామని, త్వరలో 'దళారి2' కూడా చేస్తామని నిర్మాత తెలిపారు. అందరికీ నచ్చే మంచి కథతో ఈ సినిమా రూపొందిందని రాజీవ్ కనకాల చెప్పారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**